PRGI No: TGBIL/25/A0946

# విశాలజ్యోతి

సమగ్ర తెలుగు దినపత్రిక

DK MEDIA
approved by Govt of INDIA, TELANGANA
OUR SERVICES
* NEWS PAPER
* NEWS CHANNEL
* DK GRAPHICS
* DK ADS & PROMOTIONS
* DK PRINTERS
* DK PUBLICATIONS
WE'RE HIRING REPORTERS
for more details: 9440711117, www.vishalajyothi.com

వరంగల్ సంపుటి : 01 సంచిక : 334 శుక్రవారం, జూన్ 26 2026 , పేజీలు - 5 వెల : 5 రూ/-

### తుంగభద్ర నది మూడు రాష్ట్రాల్లో లక్షలాది మందికి

## జీవనోపాధి కల్పిస్తోంది



**తుంగభద్ర:** బహుళార్థక సాధక ప్రాజెక్టు అయిన తుంగభద్ర పునరుజ్జీవం సంతరించుకుంది. కొత్తగా ఏర్పాటు చేసిన జలాశయం గేట్లను కేంద్రమంత్రి సీఆర్ పాటిల్‌తో కలిసి ఆంధ్రప్రదేశ్?, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి, డీకే శివకుమార్ లాంఛనంగా ప్రారంభించారు. కర్ణాటక రాష్ట్రం హోస్పేటలో జరిగిన ఈ కార్యక్రమం సందడి వాతావరణంలో సాగింది. అంతకుముందు ముగ్గురు సీఎంలతో కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ భేటీ అయ్యి మూడు రాష్ట్రాల నీటి సమస్యలపై చర్చించారు. మూడు రాష్ట్రాలకు మేలు చేసే తుంగభద్ర జలాశయం కొత్త గేట్లతో కళకళలాడుతోంది. కర్ణాటకలోని హోస్పేటలో నూతన గేట్ల ప్రారంభోత్సవం ఆహ్లాదకర వాతావరణంలో సాగింది. కేంద్రమంత్రితో పాటు మూడు రాష్ట్రాల సీఎంలు, నీటిపారుదల శాఖా మంత్రులు, అధికారులు తరలివచ్చారు. ప్రాజెక్టు 17వ గేటును కేంద్రమంత్రి సీఆర్ పాటిల్, 8వ గేటును కర్ణాటక సీఎం డీకే శివకుమార్, 19వ గేటును ఏపీ సీఎం చంద్రబాబు, ప్రాజెక్టు 20వ గేటును తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా పూజలు నిర్వహించారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ముగ్గురు సీఎంలు కలవడం ఓ చరిత్ర : ఈ సందర్భంగా నిర్వహించిన సభలో చంద్రబాబు మాట్లాడారు. "తుంగభద్ర మూడు రాష్ట్రాల్లో లక్షలాది మందికి జీవనోపాధి కల్పిస్తోంది. ఆరు నెలల్లో 33 గేట్లు అమర్చిన అందరినీ అభినందిస్తున్నా. కేంద్ర జలవనరులశాఖ మంత్రి సీఆర్ పాటిల్ నేతృత్వంలో ముగ్గురు సీఎంలు కలవడం ఓ చరిత్ర. కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలకు తుంగభద్ర తాగు, సాగు నీరు ఇచ్చింది. ఈ నది లేకపోతే చాలా సమస్యలు వచ్చేవి. జలవనరుల సంరక్షణ, సమర్థ నీటి నిర్వహణ మనందరి బాధ్యత. ప్రధాని మోదీ నేతృత్వంలో భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోంది. దేశంలో నదుల అనుసంధానం చేయాల్సిన బాధ్యత ఉంది. గంగ, కావేరి నదులను అనుసంధానం చేస్తే భారత్ అన్‌స్టాపబుల్‌గా దూసుకెళ్తుంది. సీఆర్ పాటిల్‌కు నదులు అనుసంధానం చేసిన అనుభవం ఉంది. జాతీయ ప్రాజెక్టుగా గోదావరి-కావేరిని కేంద్రం అనుసంధానం చేయాలి" అని చంద్రబాబు అన్నారు. తుంగా పానం - గంగా స్నానం ప్రసిద్ధ సామెత. తాగడానికి స్వచ్ఛంగా, తీయగా తుంగా నది ఉంటుంది. బహు పుణ్యానికి గంగా నది గొప్పది. తుంగభద్ర నది, మూడు రాష్ట్రాల్లో లక్షలాది మందికి జీవనోపాధి కల్పిస్తోంది. ప్రాజెక్టులంటే ఆధునిక దేవాలయాలు వాటిని పరిరక్షించుకోవాలి. తాగునీరు ఇచ్చింది. తుంగభద్ర లేకపోతే చాలా ప్రమాదం వచ్చేది. జలవనరుల సమర్థ నీటి నిర్వహణ మనందరి బాధ్యత. ప్రధాని మోదీ నేతృత్వంలో భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోంది."

### దేశంలో అమెజాన్ రూ. 4.53 లక్షల కోట్ల

## పెట్టుబడులు




**న్యూ ఢిల్లీ :** భారత్‌లో తన వ్యాపార కార్యకలాపాలను భారీగా విస్తరించేందుకు సిద్ధమైంది అమెరికాకు చెందిన ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్. 2026 నుంచి 2030 మధ్య కాలంలో భారత్‌లో ఏకంగా 48 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 4.53 లక్షల కోట్లు) పెట్టుబడి పెట్టనున్నట్లు గురువారం ప్రకటించింది. అలాగే 2030 నాటికి దేశంలో ఏఐ (ఝూ×), క్లౌడ్ మౌలిక సదుపాయాలను విస్తరించడానికి అదనంగా 13 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనున్నట్లు వెల్లడించింది. కాగా, భారత ప్రధాని నరేంద్ర మోదీతో అమెజాన్ సీఈఓ ఆండీ జాస్సీ భేటీ అయ్యారు. అనంతరం ఈ పెట్టుబడి ప్రకటన వెలువడింది.

### రైతులెవరూ భయపడొద్దు అందరికీ

## యూరియా అందిస్తాం



**ఖమ్మం, జూన్ 25:** జిల్లాలోని చింతకాని మండలం మత్కేపల్లి క్రాస్ రోడ్డులో ఈనెల 30న జరిగే సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభా స్థలాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు (గురువారం) పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాప్రభుత్వంలో అత్యంత ప్రాధాన్యం కలిగిన కార్యక్రమం రైతు భరోసా అని చెప్పుకొచ్చారు. జులై నెలలోనే రైతులకు రైతుభరోసా ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ రాష్ట్రంలో ఉన్న ప్రతి రైతుకు రైతుభరోసా కింద రూ.9 వేల కోట్లను ముఖ్యమంత్రి విడుదల చేయనున్నారన్నారు. ఈ సభకు రైతు ఆశీర్వాద సభగా రైతులే నామకరణం చేశారని తెలిపారు. భారత దేశంలో అత్యధికంగా పంటలు పండించిన రాష్ట్రం తెలంగాణ అని మంత్రి అన్నారు. వ్యవసాయ రంగంలో పంటమార్పిడి విధానంలో ఆయిల్ ఫాం సాగును ప్రోత్సహిస్తున్నామన్నారు. భవిష్యత్తులో పది వేల ఎకరాలను రైతులు సాగు చేసే విధంగా సహకారం అందజేస్తున్నామని చెప్పారు. దేశంలో తెలంగాణలోనే అత్యధిక ఆయిల్ ఫాం సాగు జరుగుతోందన్నారు. పామాయిల్ ఫ్యాక్టరీల నిర్మాణం శరవేగంగా జరుగుతోందని తెలిపారు. రెండేళ్లలో లక్ష కోట్లు రైతాంగానికి అందజేశామని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో రైతులు పండించిన ప్రతి పంటను కొనుగోలు చేశామని అన్నారు. ఏడాదికి పది వేల కోట్లు నష్టం వచ్చినప్పటికీ కొనుగోలు చేస్తున్నామన్నారు. ఏడు రకాల వరి అందుబాటులో ఉందని రైతాంగానికి తుమ్మల తెలియజేశారు. వాతావరణ పరిస్థితులను బట్టి రైతులు పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. బ్లాక్ మార్కెట్‌లో యూరియా ఉంచుతున్నారని. నిల్వ చేసి అధిక ధరలకు అమ్మేందుకు చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు ఎవరూ కూడా భయపడవద్దని.. అందరికీ యూరియా అందిస్తామని స్పష్టం చేశారు. యూరియా కోసం ప్రత్యేక యాప్‌ను తీసుకొచ్చామని.. అందులో అన్ని వివరాలు ఉన్నాయన్నారు. యూరియా కోసం తెచ్చిన యాప్ దేశానికే ఆదర్శమని ప్రధాని మోదీ కూడా ప్రశంసించే పరిస్థితి ఉందన్నారు. రైతాంగం పాడి పంటపై దృష్టి సారించాలని మంత్రి సూచించారు.

### వారణాసి నుంచి తొలి 'హబ్ అండ్ స్పోక్' విమాన

## సేవలకు శ్రీకారం



**వారణాసి :** దేశాన్ని ప్రపంచ విమానయాన కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రారంభించిన 'హబ్ అండ్ స్పోక్' మోడల్ సేవలకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కే రామ్మోహన్ నాయుడు శ్రీకారం చుట్టారు. ఈ మోడల్ కింద తొలి విమాన సేవలను గురువారం ఉత్తర్‌ప్రదేశ్ లోని వారణాసి నుంచి ప్రారంభించారు. వచ్చే ఆరు వారాల్లో మరో ఆరు భారతీయ నగరాలకు విమాన సేవలను విస్తరించనున్నట్లు ప్రకటించారు. దీనిపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందిస్తూ, 'హబ్ అండ్ స్పోక్' మోడల్ దేశంలోని ప్రాంతాలను ప్రపంచ అవకాశాలకు మరింత చేరువ చేస్తుందని అన్నారు. ఈ విధానం వల్ల ప్రయాణికుల ప్రయాణ సమయం తగ్గడమే కాకుండా, చిన్న నగరాలకు కూడా ప్రపంచ స్థాయి అనుసంధానం లభిస్తుందని పేర్కొన్నారు.' విమానాశ్రయాలపై ఒత్తిడి తగ్గుతుంది'ఈ మోడల్ వల్ల ఇప్పటికే ఉన్న మౌలిక సదుపాయాలను మరింత సమర్థంగా వినియోగించుకునే అవకాశం ఉంటుందని ప్రధాని మోదీ చెప్పారు. విమానాల వినియోగ సామర్థ్యం పెరగడంతో పాటు, ప్రధాన విమానాశ్రయాలపై ఉన్న రద్దీ కూడా తగ్గుతుందని పేర్కొన్నారు. అత్యంత ముఖ్యంగా, దేశంలోని మరిన్ని ప్రాంతాలను ప్రపంచ అవకాశాలకు దగ్గర చేస్తుందని ప్రధాని తన సందేశంలో పేర్కొన్నారు. ఈ కొత్త మోడల్ కింద తొలి సేవలు ప్రారంభమైన వారణాసికి ప్రత్యేక గుర్తింపు ఉందని తెలిపారు. ప్రపంచంలోనే అత్యంత పురాతన జీవన నగరాల్లో ఒకటైన వారణాసి భారతీయ నాగరికతకు ప్రతీక అని పేర్కొన్నారు. అభివృద్ధి, వారసత్వం రెండింటినీ సమన్వయం చేస్తూ ముందుకు సాగాలన్న తమ దృక్పథానికి వారణాసి ప్రతిబింబమని చెప్పారు. మెరుగైన విమాన అనుసంధానం ద్వారా ఈ నగరం ప్రపంచంతో మరింత బలమైన సంబంధాలను ఏర్పరుచుకుంటూనే తన ప్రత్యేకతను కాపాడుకుంటుందని పేర్కొన్నారు.

### తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ

## చరిత్రలో నిలిచిపోతుంది

- రాజోలిబండకు కేటాయించిన 15 టీఎంసీల్లో మేం నాలుగైదు టీఎంసీలే వాడుకుంటున్నాం
- తుంగభద్ర ప్రాజెక్టు కొత్త గేట్లు ప్రారంభం
- ప్రారంభించిన మూడు రాష్ట్రాల సీఎంలు, కేంద్రమంత్రి
- హోస్పేటలో తుంగభద్ర గేట్లు ప్రారంభించిన కర్ణాటక, తెలంగాణ, ఏపీ ముఖ్యమంత్రులు



**తుంగభద్ర:** తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ ముహూర్తం చరిత్రలో నిలిచి పోతుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. 3 తరాల సమస్యలను 33 గేట్ల పునరుద్ధరణ పరిష్కరించబోతోందని చెప్పారు. బళ్లారి, కర్నూలు, అనంతపురం, పాలమూరు సమస్యలను తుంగభద్ర తీరుస్తుందన్న ఆయన తక్కువ మాట్లాడి ఎక్కువ పనులు చేయడం సీఆర్ పాటిల్ ప్రత్యేకత అని అన్నారు. కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య ఉన్న నీటి సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. నీటి సమస్యలు పరిష్కరించుకోకపోతే అవి నేరుగా వల్ల సముద్రంలో కలుస్తాయని సీఎం రేవంత్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. తుంగభద్ర జలాల సమస్యకు పరిష్కారం చూపాలనే ముగ్గురు సీఎంలు ఇక్కడ కలుసుకోవడం జరిగిందన్నారు. ప్రస్తుతం చర్చలు కొలిక్కి వచ్చాయని, కేంద్రమంత్రి సీఆర్‌పాటిల్ పరిష్కారం చూపుతారని విశ్వసిస్తున్నట్లు పేర్కొన్నారు. రాజోలి బండ డైవర్షన్ స్కీం ద్వారా రావాల్సిన 15.9 టీఎంసీల్లో ఐదారు టీఎంసీలే వస్తున్నాయన్న ఆయన దాదాపు పది టీఎంసీల నీళ్లు తెలంగాణకు రావట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పరిష్కారానికి కలిసికట్టుగా పనిచేస్తాం : తుంగభద్రలో మట్టి పేరుకుపోవడం, నీటి తరలింపు వంటి సమస్యలకు పరిష్కారం చూపాలని సీఎం రేవంత్ రెడ్డి కేంద్రాన్ని కోరారు. కర్ణాటక సీఎం డీకే శివకుమార్ సూచనతో సమస్యల పరిష్కారానికి కలిసికట్టుగా పనిచేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ రోజును చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబోతున్నారని, తుంగభద్ర ఒడ్డున చర్చలు చరిత్రలో గొప్ప నిర్ణయంగా మారబోతున్నాయని అన్నారు.

### హిట్లర్‌ను ఆదర్శంగా తీసుకుని రేవంత్

## ఎగిరెగిరిపడుతున్నారు



**హైదరాబాద్, జూన్ 25 :**

రాష్ట్ర అప్పులపై కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఆరోపించారు. పదేళ్లలో కేసీఆర్ చేసిన అప్పులు రూ.2.80లక్షల కోట్లు మాత్రమేనని చెప్పుకొచ్చారు. (గురు వారం) హైదరాబాద్ వేదికగా మీడి యాతో కేటీఆర్ మాట్లాడారు. అప్పు చేసి కేసీఆర్ ఎంతో అభివృద్ధి, సంక్షేమం చేశారని తెలిపారు. రేవంత్‌రెడ్డి పాలనలో రియల్ ఎస్టేట్ ఆగమైందని ఆరోపించారు. ఒకప్పుడు రూ.కోట్లు పలికిన భూముల ధరలు ఎందుకు పడిపో యాయని ప్రశ్నించారు. హిట్లర్‌ను ఆదర్శంగా తీసుకుని రేవంత్ ఎగిరెగిరిపడుతున్నారని సెటైర్లు వేశారు. మూడుసార్లు రైతుబంధు ఎగ్గొట్టిన రేవంత్‌ను ఏమనాలి? అని ప్రశ్నించారు. రైతులకు కాంగ్రెస్ ఎన్నో హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందని చెప్పారు. రేవంత్‌రెడ్డి 72సార్లు ఢిల్లీ వెళ్లి 72పైసలు తీసుకురాలేదని కేటీఆర్ ఎద్దేవా చేశారు.

## అక్కసుతోనే అడ్డగోలు మాటలు

- కేటీఆర్, హరీశ్‌పై మహేష్ ఆగ్రహం



**హైదరాబాద్, జూన్ 25:** తెలంగాణ కాంగ్రెస్ గిరిజన నేతలు చేపట్టిన ఇందిరమ్మ ఆశీర్వాద బస్సు యాత్రను టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేటీఆర్, హరీశ్‌రావు శకం గతమని.. అధికారం పోయిందన్న అక్కసుతో వారిద్దరూ అడ్డగోలుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఇందిరాగాంధీ.. ఎస్టీ రిజర్వేషన్ ఇవ్వకపోయి ఉంటే నేడు లంబాడీలు, ఎరుకల, యానాదిలు ఈ స్థాయిలో ఉండేవాళ్లు కాదన్నారు. లంబాడీల బాగు కోసం పనిచేసే ప్రభుత్వం తమది అని స్పష్టం చేశారు. ఇందిరాగాంధీ గుడిసెలు లేని గ్రామాలు కావాలని అనుకున్నారని.. ఆ దిశగానే తాము ముందుకు వెళున్నామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి.. బావాబామ్మర్దులకు నచ్చడం లేదని మహేష్ విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో 100 సీట్లు తగ్గకుండా మళ్లీ అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. 1 లక్ష 78 వేల కోట్ల రూపాయల విదేశీ పెట్టుబడులు తీసుకొచ్చామని తెలిపారు. ఫ్యూచర్ సిటీని మొదలు పెట్టి 5 లక్షల 78 వేల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చామని చెప్పారు. బస్సు యాత్ర ముగింపు కార్యక్రమానికి ప్రియాంక గాంధీని తీసుకువచ్చే ప్రయత్నం చేస్తామని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ లంబాడ ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరయ్యారు.

### మన వాళ్ల హక్కులను కాపాడటంలో

## వెనక్కు తగ్గేదేలే.



**హైదరాబాద్, జూన్ 25 :**

జులై 2వ తేదీన జరిగే భూ పోరాటాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. తెలంగాణ స్థానికత విషయంలో మళ్లీ కుట్ర జరుగుతోందని ఆరోపించారు. (గురువారం) హైదరాబాద్ ఖైరతాబాద్‌లోని ఎంఎస్‌మక్తాలో పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడారు. తెలంగాణ బిడ్డలకే ఉద్యోగాలు దక్కాలి..ఒకటి నుంచి ఏడోతరగతి వరకు ఎక్కడ చదివినా తెలంగాణలో స్థానికులు అని కోర్టు చెబుతోందని కవిత అన్నారు. తెలంగాణ బిడ్డలకే ఉద్యోగాలు దక్కాలని.. మన వాళ్ల హక్కులు కాపాడటంలో వెనక్కు తగ్గేదేలేదని స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో టీఆర్ఎస్ సత్తా చాటుతుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రపంచమే మహిళలకు వ్యతిరేకంగా ఉందని పేర్కొన్నారు. ఉద్యమకారులకు భూములు ఇవ్వడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ఆలస్యం చేస్తోందని ప్రశ్నించారు. అనేకమంది ఉద్యమకారులకు అన్యాయం జరిగిందని తెలిపారు. ఉద్యమకారులు, నిరుద్యోగ సంఘాలతో కలిసి ప్రభుత్వ భూమిని ఆక్రమించుకోబోతున్నామని అన్నారు. ఈ భూములను పేదవాళ్లకు పంచబోతున్నామని వెల్లడించారు. ఉద్యమకారులకు భూమి ఇవ్వకుండా ప్రభుత్వం ఆలస్యం చేస్తుందని పేర్కొన్నారు. అంబర్‌పేట నియోజకవర్గంలో పోటీ చేస్తామని కవిత చెప్పుకొచ్చారు. నీటి హక్కును కోల్పోతాం..తుంగభద్రలో మన నీటి వాటాకు తూట్లు పొడిచే పనికి సీఎం రేవంత్‌రెడ్డి మద్దతిచ్చారని కవిత ఆరోపించారు.

శుక్రవారం,
జూన్ 26 2026

PRGI No: TGBIL/25/A0946
విశాలజ్యోతి
సమగ్ర తెలుగు దినపత్రిక



# నిమిషాల వ్యవధిలోనే మనవరాలు, నానమ్మ మృతి జనగామ జిల్లాలో విషాదం



హైదరాబాద్ : జనగామ జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. అప్పటి వరకు కండ్లముందే ఆడుకున్న మనవరాలు అంతలోనే కన్నుమూయడంతో ఆ నానమ్మ హృదయం తట్టుకోలేకపోయింది. చిన్నారి మృతి చెందడంతో గుండెపోటుతో నానమ్మ తనువు చాలించింది. ఈ హృదయవిదారకమైన సంఘటన జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ నగర్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ప్రియాన్ని(18 నెలలు) అనే చిన్నారి ఆడుకుంటే వెళ్లి నీటి సంపులో పడి మృత్యువాత పడిం ది.మనవరాలు మృతితో ఏడుస్తూ నానమ్మ మాంబోయిన నాగమ్మ(65) గుండెపోటుకు గురై మృతి చెందారు. నిమిషాల వ్యవధిలోనే ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మృతి చెందడంతో బంధువుల రోదనలు మిన్నంటాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# నల్లగొండలో ఒకే ఇంట్లో నలుగురు మృతి కేసులో వీడిన మిస్టరీ



హైదరాబాద్ : నల్లగొండలో ఒకే ఇంట్లో నలుగురు మృతి చెందిన కేసులో మిస్టరీ వీడింది. నల్లగొండ జిల్లా కేంద్రం సాగర్ రోడ్డు తెలంగాణ కాలనీలో ఒకే కుటుంబానికి చెందిన మహమ్మద్ సుల్తాన్ (45), ఆయన భార్య హసీనా (40), కుమారుడు ముజమిల్(20), కుమార్తె అక్సర (11) అనుమానాస్పద మృతి కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. హత్యకు గురైన హసీనా మొదటి భర్త కూతురు, అల్లుడు కలిసి సుపారీ గ్యాంగ్ చేత హత్య చేయించినట్లు నిర్ధారణ అయింది.హసీనాకు గతంలో రెండు పెళ్లిళ్లు జరగగా.. నల్లగొండకు చెందిన మహ్మద్ సుల్తాన్‌ను మూడో వివాహం చేసుకుంది. సుల్తాన్‌కు కూడా గతంలో రెండు పెళ్లిళ్లు జరగగా.. సుల్తాన్ మొదటి భార్య పిల్లలు మహ్మద్ ముజమిల్, అప్సరతో కలిసి నల్లగొండలో జీవిస్తున్నారు. హసీనా పేరు మీద కోటి రూపాయల విలువైన స్థలాలు, ఇండ్లు ఉన్నాయి.ఆ ఆస్తిని తమకు ఇవ్వకుండా తన మూడో భర్త అయిన సుల్తాన్ పిల్లల మీద వీలునామా రాస్తున్నట్లు హసీనా చెప్పడంతో కక్ష పెంచుకొని, హసీనా మొదటి భర్త కూతురు, అల్లుడు కలిసి హైదరాబాద్ పాతబస్తీకి చెందిన నలుగురు రౌడీ షీటర్ల చేత హత్య చేయించి పోలీసులు నిరాధరించారు. పోస్టుమార్టం నివేదిక ప్రకారం.. సుల్తాన్ మృతదేహంపై 6 చోట్ల కత్తి గాయాలు ఉండగా, హసీనాకు 7 చోట్ల, కుమార్తె అక్సరకు 9 చోట్ల, ముజమిల్‌కు ఏకంగా 16 కత్తిపోట్లు ఉన్నట్లు గుర్తించారు. పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## మంచిర్యాలలో కత్తులతో పొడిచి వ్యక్తి దారుణ హత్య



మంచిర్యాల అర్బన్ జూన్ 25 : మంచిర్యాలజిల్లా కేంద్రంలోని అండాళమ్మ కాలనీ జలగుట్ట ప్రాంతంలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైన ఘటన స్థానికంగా కలకలం రేపింది. మహబూబాబాద్ జిల్లా బయ్యారం ప్రాంతానికి చెందిన లాక్‌పతి అనే వ్యక్తిని గుర్తుతెలియని దుండగులు కత్తులతో పొడిచి హత్య చేసినట్లు సమాచారం.స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## తెలంగాణ ఎక్సైజ్ శాఖలో భారీగా బదిలీలు
## గ్రేటర్ హైదరాబాద్ డీసీగా శ్రీనివాస్‌రెడ్డి




హైదరాబాద్ : రాష్ట్రంలో పలు జిల్లాల్లో ఎక్సైజ్ శాఖ లో డిప్యూటీ కమిషనర్లు గా పనిచేస్తున్న అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. మరి కొందరికి కొత్తగా పోస్టింగులు ఇస్తూ ప్రభుత్వ కార్యదర్శి రఘునందన్ రావు ఉత్తర్వులు జారీ చేశారు. మెదక్‌లో డిప్యూటీ కమిషనర్‌గా పని చేస్తున్న జె హరికిషన్‌ను సైబరాబాద్ డీసీగా, నల్గొండలో డీసీగా పనిచేస్తున్న ఏ శ్రీనివాస్‌రెడ్డి ని గ్రెటర్ హైదరాబాద్ డీసీగా బదిలీ చేశారు.రంగారెడ్డి డీసీగా ఉన్న దశరథను టీజీబీసీఎల్ డీసీగా, ఖమ్మంలో డీసీగా ఉన్న జనార్దన్ రెడ్డి ఆదిలాబాద్ డీసీగా బదిలీ చేశారు. టీజీబీసీఎల్ ఆర్ఆర్-1లో ఉన్న దాతురాజు గౌడ్‌ను వరంగల్ డీసీగా, నిజామాబాద్‌లో ఏసీగా ఉన్న వి.సోమిరెడ్డిని ఖమ్మం డీసీగా, కరీంనగర్ బీసీఎల్‌లో మేనేజర్‌గా ఉన్న రవీకుమార్‌ను కరీంనగర్ డీసీగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఏసీ లేబుల్స్‌లో పనిచేస్తున్న పి శ్రీధర్‌ను నిజామాబాద్ డీసీగా, హెడ్‌క్వార్టర్స్‌లో డీసీగా ఉన్న కె రఘురాంను రంగారెడ్డి డీసీగా, హైదరాబాద్ ఏసీగా ఉన్న ఏ అనిల్ కుమార్ రెడ్డిని ఈస్ట్ జాయింట్ డైరెక్టర్‌గా ప్రభుత్వం బదిలీ చేసింది.స్పెషల్ టాస్క్ ఫోర్స్‌లో ఏసీగా ఉన్న పి ప్రణవిని మల్కాజిగిరి డీసీగా, మహబూబ్ నగర్ ఏసీ విజయ్ భాస్కర్ రెడ్డి డీసీ అక్కడే పదోన్నతి కల్పించింది. బ్రేవర్సీలో ఏసీగా ఉన్న చంద్రయ్యను మెదక్ డీసీగా, ఈస్ట్ జాయింట్ డైరెక్టర్‌గా ఉన్న సీవీ శశిధర్ రెడ్డిని నల్గొండ డీసీగా బదిలీ చేసింది. బదిలీ అయిన అధికారులు తక్షణమే విధుల్లో చేరాలని ప్రభుత్వం ఆదేశించింది .

# గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందజేత



కమాన్ చౌరస్తా, జూన్ 25 : హుజురాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో కరీంనగర్ అర్బన్‌లోని 25 ప్రభుత్వ సెక్టార్ పాఠశాలలో గత సంవత్సరం పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన 42 మంది విద్యార్థులకు గురువారం ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాధికారి ఎన్ ప్రశాంత్ రెడ్డి, ట్రస్టు నిర్వాహకులు డాక్టర్ గంగిశెట్టి జగదీశ్వర్ హాజరై విద్యా ర్థులకు పురస్కారాలు అందించారుఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి మాట్లాడుతూ పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులు భవిష్యత్‌లో కూడా ఇలాంటి ప్రతిభను కొనసాగించాలని, మీరందరూ కూడా ప్రభుత్వ జూనియర్ కాలేజీలలో జాయిన్ కావాలని, ఇప్పుడు అన్ని జూనియర్ కాలేజీలో అనుభవం ఉన్న అధ్యాపకులు, వసతులు ఉన్నాయని, ప్రభుత్వ కళాశాలలో మధ్యాహ్న భోజనం కూడా ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. మధురమ్మ మెమోరియల్ ట్రస్టు ప్రతీ సంవత్సరం ప్రభుత్వ సెక్టార్లలో చదివే విద్యార్థులకు టాలెంట్ టెస్టులు నిర్వహించి బహుమతులు ఇవ్వడం అభినందనీయమ న్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం వసుం ధర, జిల్లా సైన్స్ ఆఫీసర్ సీహెచ్ జైపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు టీ లింగారెడ్డి, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ కు న్యాయ కోరుట్లలో గలమెత్తిన పద్మశాలీలు గ్రామస్తులు



కోరుట్ల, జూన్ 25 : కోరుట్ల మండలంలోని అయిలాపూర్ కు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థ్ధజ అంకం రాహుల్ మృతిపై అనుమానాలు నివృత్తి చేయాలని, మృతికి కారకులైన వారిని చట్టపరంగా శిక్షించాలని కోరుతూ కోరుట్ల పట్టణంలో పద్మశాలీ సంఘం నేతలు, గ్రామస్తులు గురువారం నిరసన గళమెత్తారు. ఇంజనీరింగ్ విద్యార్థి మృతి మిస్టరీ ఛేదనలో పోలీసులు తాత్సరం చేస్తున్నారని ఆరోపిస్తూ ప్లకార్డులతో నిరసనకు దిగారు. హైదరాబాద్ లోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్న అంకం రాహుల్ ఆంధ్రప్రదేశ్ లోని సింగరాయ కొండ ప్రాంతంలోని పాడుబడిన బావిలో ఇటీవల శవమై తేలాడు. ఇందుకు సంబందించి అక్కడి పోలీసులు కేసు నమోదు చేశారు.రాహుల్ కుటుంబసభ్యుల ఫిర్యాదుతో హైదరాబాద్‌లోని గచ్చిబౌలి పోలీస్ స్టేషన్లోను కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో రాహుల్ మృతి చెంది సుమారు నెల రోజులు గడుస్తున్నా పోలీసులు రాహుల్ శవాన్ని కుటుంబసభ్యులకు అందజేయకపోవడాన్ని నిరసిస్తూ పద్మశాలీ కులస్తులు, అయిలాపూర్ గ్రామస్తులు పెద్ద ఎత్తున కోరుట్లకు చేరుకున్నారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కోరుట్లలోని కార్గిల్ చౌరస్తా జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి, బీసీ రాజ్యాధికార సంఘం ప్రతినిధి దాసు సురేష్ మాట్లాడుతూ ఎంతో భవిష్యత్ ఉన్న అంకం రాహుల్ మృతి బాధకరమన్నారు. 25 రోజులు గడుస్తున్నా రాహుల్ మృతిపై రెండు రాష్ట్రాల పోలీసులు ఖచ్చితమైన సమాచారాన్ని ఇవ్వడం లేదన్నారు. రాహుల్ ను బెదిరింపులకు గురి చేసిన వ్యక్తులపై ఇప్పటి వరకు ఏలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.నిరుపేద కుటుంబానికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి మరణిస్తే రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి కనీస స్పందన లేదన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించాలని, రాహుల్ మృతిపై సీబీఐ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. మృతికి కారణమైన వారు ఎంతటి వారైనా చటపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని బీసీ బిడ్డకు న్యాయం జరిగే వరకు విశ్రమించేది లేదని ఉద్ఘాటించారు. అనంతరం కార్గిల్ చౌక్ నుంచి జాతీయ రహదారి మీదుగా కొత్త బస్టాండు వరకు ర్యాలీగా వెళ్లారు. అంబేద్కర్ విగ్రహానికి రాహుల్ తల్లిదండ్రులు రాజేష్, కవితతో కలిసి నాయకులు వినతి పత్రం అందజేశారు. అంతకుముందు పద్మశాలీ సంఘం నేతలు కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహనికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో పద్మశాలీ సంఘం జాతీయ కార్యదర్శి గడ్డం జగన్నాథం, జాతీయ రాజకీయ విభాగం అధ్యక్షుడు బొట్ల శివ శంకర్, యువజన విభాగం ఇన్‌చార్జి అవ్వారి భాస్కర్, తెలంగాణ పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామర్తపు మురళి, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మెతుకు సత్యం, తెలంగాణ పద్మశాలీ సంఘం ఉపాధ్యక్షుడు గుర్రం శ్రవణ్, రాష్ట్ర కార్యదర్శి కృష్ణ హరి, మీడియా కార్యదర్శి మార్త ప్రకాష్, జగిత్యాల జిల్లా పద్మశాలీ సంఘం అధ్యకుడు రుద్ర శ్రీ నివాస్, జిల్లా నాయకులు దీకొండ లక్ష్మీనారాయణ. చిలుక నర్సప్పా, మెతుకు వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ పదో తరగతి సప్లిమెంటరీ ఫలితాలు విడుదల




హైదరాబాద్ : తెలంగాణ 10వ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలువిడుదల య్యాయి. మధ్యాహ్నం 3 గంటలకు ఈ ఫలి తాలను పాఠశాల సంచాలకుడు నవీన్ నికో లస్ విడుదల చేశారు. జూన్ 5 నుంచి 12 వరకు పరీక్షలు నిర్వహించగా.. 27,857 మందిలో 23,103 విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. సప్లిమెంటరీ పరీక్షల్లో 82.61 శాతం ఉత్తీర్ణత నమోదయింది. రెగ్యులర్ పరీక్షల మాదిరిగానే సప్లిమెంటరీ ఫలితాల్లో కూడా బాలికలే పై చేయి సాధించారు. ఫలితాలను అధికారిక వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని అధికారులు తెలిపారు.

# కాంగ్రెస్ వచ్చాక కొత్త స్కీమ్‌లు లేవు అన్నీ స్కామ్‌లే రేవంత్ సర్కార్‌పై హరీశ్‌రావు ఫైర్



కాంగ్రెస్ వచ్చాక కొత్త స్కీమ్స్ ఏమీ రాలేదు కానీ అన్ని స్కామ్‌లే జరిగాయని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు విమర్శించారు. కాంగ్రెసోళ్లు కేవలం ఓట్ల కోసమే వస్తారని.. ఓట్లు అయిపోతే మాయమవు తారని అన్నారు. కానీ బతుకమ్మ, దసరా, రంజాన్, బక్రీద్, క్రిస్మస్.. ఇలా ఏ పండుగైనా, కష్టమైనా నిరంతరం మీ మధ్య ఉంటూ మీ అన్నదమ్ముల్లా, అక్కాచెల్లెళ్లలా ఉండేది బీఆంఎస్ పార్టీ మాత్రమేనని స్పష్టం చేశారు.
సిద్దిపేట పట్టణంలోని 29వ వార్డులో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని హరీశ్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకప్పుడు సిద్దిపేటలో నీళ్ల కోసం సైకిల్‌కు అటొక బకెట్, ఇటొక బకెట్ కట్టుకొని ట్యాంకర్ల వెంట పడేవాళ్లమని గుర్తుచేశారు. వారానికి, ఐదు రోజులకు ఒకసారి నీళ్లు వచ్చేవి. కేసీఆర్ కాళేశ్వరం, మల్లన్న సాగర్ కట్టాక ఇప్పుడు సిద్దిపేటలో రోజూ ఇంటింటికీ మంచినీళు వస్తున్నాయని తెలిపారు. ఇవాళ హైదరాబాద్‌కు నీళ్లు ఇవ్వడానికి 8 వేల కోట్లతో లైన్లు వేస్తున్నారు, కానీ మన సిద్దిపేటలో మాత్రం ఎప్పటి నుంచో కాళేశ్వరం, మల్లన్న సాగర్ నీళ్లు తాగుతున్నామని పేర్కొన్నారు. వార్డులో 90-95 శాతం సిమెంట్ రోడ్లు వేసుకున్నాం, మిగిలినవి కూడా పూర్తి చేసుకుందామని అన్నారుసిద్దిపేటను జిల్లాగా మార్చుకున్నామని హరీశ్‌రావు అన్నారు. మనుషుల డాక్టర్, పంటల డాక్టర్, పశువుల డాక్టర్.. ఇలా అన్ని రకాల వైద్య విద్యలను మెడికల్, నర్సింగ్, బి-ఫార్మసీ, డైట్ కాలేజీలు సిద్దిపేటకే తెచ్చుకున్నామని తెలిపారు. టీవీల్లో, సినిమాల్లో మాత్రమే చూసిన రైలును ఇవాళ సిద్దిపేట దాకా తీసుకొచ్చి మన కల సాకారం చేశామని తెలిపారు. పట్టణం చుట్టూ రెండు రింగ్ రోడ్లు వేసుకున్నామని.. వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని, దాని వెనుక ధ్యాన మందిరం, అన్నదాన సత్రాన్ని అద్భుతంగా అభివృద్ధి చేసుకున్నామని తెలిపారు.

## రాగల మూడు గంటల్లో 21 జిల్లాల్లో ఉరుములతో కూడిన వర్షాలు హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చరిక



రాగల రెండు మూడు గంటల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురుస్తుందని హైదరాబాద్ వాతావరణ శాఖ అంచనా వేసింది. ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, జగిత్యాల, జనగామ, జోగులాంబ గద్వాల, కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, కుమ్రంభీం ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, మెదక్, ములుగు, నాగర్‌కర్నూలు, నారాయణపేట, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, సంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, వనపర్తి, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ మేరకు 21 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.
రేపు మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. ఇక రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఎల్లుండి ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నాగర్‌కర్నూలు,వనపర్తి, జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది.

# కర్ణాటక అక్రమ ప్రాజెక్టులు పాలమూరుకు మరణ శాసనం మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

మహబూబ్ నగర్ : కర్ణాటక ప్రభుత్వం నిర్మిస్తున్న అక్రమ ప్రాజెక్టుల వల్ల తెలంగాణకు మరణ శాసనం కానుందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఆర్డీఎస్‌పై కృష్ణ పరివాహక ప్రాంతంలో ఆయా ప్రాంత రైతులు ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. తాము మాట్లాడుతున్నది అవాస్తవం కాదని అన్నారు.తుంగభద్ర ప్రాజెక్టు గేట్ల ఎత్తివేతకు హెలికాప్టర్‌లో వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అక్రమా ప్రాజెక్టులు కనిపించలేదా అని ప్రశ్నించారు. ఆర్డీఎస్‌కు వంద మీటర్ల దూరంలోనే కర్ణాటక ప్రభుత్వం లిఫ్ట్ పనులు మొదలు పెట్టిందని, వీటితోపాటు మరో రెండు రోడ్ కమ్ బ్యారేజులు కడుతుందని ఆరోపించారు. చంద్రబాబు గుండ్రేవుల వద్ద 20 టీఎంసీల రిజర్వాయర్‌కు ప్రణాళిక తయారు చేశారని వెల్లడించారు. వీటి వల్ల తుంగభద్ర నీరు శ్రీశైలంకు శాశ్వతంగా రావని వివరించారు.కృష్ణా పైకూడా అనేక ప్రాజెక్టులు కడుతున్నారని, ఇవన్నీ ఎలాంటి అనుమతులు లేకుండానే జరుగుతున్నాయని వెల్లడించారు. అక్రమ నిర్మాణాలు పూర్తయితే పాలమూరు లో ఎన్ని ప్రాజెక్టులు కట్టినా ఒక్క చుక్క నీరు రాదని పేర్కొన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అయినా అక్రమ ప్రాజెక్టుల వద్దకు వెళ్లి చూడాలని కోరారు. జిల్లాకు చెందిన అధికార పార్టీ ఎమ్మెల్యేలు కూడా వ్యతిరేకించారని తెలిపారు.

## వాష్ రూమ్‌కు వెళ్లిన మహిళపై దాడి
## గోల్డ్‌చైన్‌తో పరారైన దుండగుడు

వినాయక నగర్, జూన్, 25 : నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఓ మహిళ వాష్ రూమ్‌కు వెళ్లడాన్ని గమనించిన దుండగుడు ఆమె పై దాడి చేశాడు. ఆమె అరిచేలోపే సదరు మహిళ మెడలోని 5 తులాల బంగారు గొలుసు తెంచుకొని పరారయ్యాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని ఆర్య నగర్ ప్రాంతంలో గల ఎఫ్‌సీఐ కాలనీలో నివాసముండే కొట్టే నాగమణి అనే మహిళ బుధవారం అర్ధరాత్రి సుమారు 2గంటల సమయంలో తమ ఇంటి బయట ఉన్న వాష్ రూమ్‌కు వెళ్లేందుకు ఇంట్లోంచి బయటకు వచ్చింది.అదే సమయంలో అక్కడ మాటు వేసి ఉన్న ఓ దుండగుడు ఆమె మెడలోని ఐదు తులాల బంగారు పుస్తెలతాడు తెంచుకొని పరాయ్యాడు.

# ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.11 లక్షల విరాళం

**తిరుమల :** శ్రీవారి భక్తులకు నిత్యం ఉచితంగా అన్నప్రసాద సేవలను అందిస్తున్న టీటీడీ ఆధ్వర్యంలోని ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టు కు గురువారం రూ.11 లక్షల విరాళం అందింది. బెంగుళూరుకు చెందిన హైషాని ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ విరాళాన్ని అందించింది. ఈ మేరకు విరాళం డీడీని తిరుమల శ్రీవారి ఆలయంలోని రంగనాయకు ల మండపంలో టీటీడీ అదనపు ఈవో సిహెచ్. వెంకయ్య చౌదరికి సంస్థ ప్రతిని ధులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, సంస్థ ప్రతినిధి రాఘవేంద్ర, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



**తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ**

తిరుమల వేంకటేశ్వర సన్నిధిలో భక్తుల రద్దీ కొనసాగుతుంది . వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో 31 కంపార్టుమెంట్లు నిండిపోయాయి . టోకెన్లు లేని భక్తులకు 12 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని టీటీడీ అధికారులు వివరించారు. స్వామివారిని బుధవారం 70,139 మంది భక్తులు దర్శించుకోగా 34,940 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల వల్ల హుండీకి రూ. 4.63 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు.

# జాను మిస్సింగ్ కేసు పాప ఈ లొకేషన్‌లో

## ఉందంటూ మరో జ్యోతిష్యుడి హల్ చల్

**కాకినాడ జిల్లా:** తుని నియోజకవర్గం దొండవాకలో అదృశ్యమైన చిన్నారి జ్ఞానేశ్వరి (జాను) మిస్సింగ్ కేసులో సస్పెన్స్ కొనసాగుతూనే ఉంది. 19 రోజులైనా అదృశ్యమైన చిన్నారి ఆచూకీ దొరకకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే ఏపీ పోలీసులు చిన్నారి కోసం బృందాలుగా గాలింపు కొనసాగిస్తున్నారు. కాగా ఇటీవలే తెలంగాణ నుంచి వచ్చినట్టు చెప్పుకున్న ఓ జ్యోతిష్యుడు పాప జ్ఞానేశ్వరి భూదేవిలో కలిసిపోయిందని, తాను పూజలు చేస్తే తిరిగి వస్తుందంటూ అర్ధరాత్రి ఆ పాప ఇంటిపైకి ఎక్కి హల్ చల్ చేశాడని తెలిసిందేతాజాగా చిన్నారి ఇంటి వద్ద మరో జ్యోతిష్యుడు హల్ చల్ చేశాడు. చిన్నారిని తూర్పు దిశగా తీసుకెళ్లారని, జూలై, సెప్టెంబర్ నెలలోపు తిరిగి వస్తుందని జోష్యం చెప్పాడు. అంతేకాదు చిన్నారి ఇంటికి 100 కిలోమీటర్ల దూరంలో ఉంది, కొందరు ఆమెను తీసుకెళ్లారు.. ఆమెకు ఎలాంటి హానీ జరుగలేదు. పాప ఎక్కడున్నా సురక్షితంగానే ఉంది. ఆమె పక్కా దొరికే కస్తదని కూడా నేను చెప్పగలను. నాకు ఆ శక్తి ఉంది. అమ్మాయి ఈ లొకేషన్‌లో ఉందంటూ సదరు జ్యోతిష్యుడు చెప్పడం అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది.



# మా పార్టీ అధ్యక్షులను కొంచెం ఫ్రీగా వదిలేయండి

## డ్రంక్ అండ్ డ్రైవ్‌పై టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్ కామెంట్స్ వైరల్

డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రాణాలకు ఎంత ప్రమాదకరమో తెలియజేస్తూ తెలుగురా ష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా పోలీసులు ఎప్ప టికప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వ హిస్తుండటం చూస్తూనే ఉంటాం. ఎవరైనా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడితే నియమ నిబంధనల ప్రకారం జైలు శిక్ష, జరిమానాలు కూడా విధిస్తుంటారు. అయితే డ్రంక్ అండ్ డ్రైవ్ చేయొద్దు అంటూ ప్రజలకు అవగాహన కల్పించాల్సిన ప్రజాప్రతినిధులే వారికి మద్దతు ఇస్తే ఎలా ఉంటుంది. తాజాగా ఏపీ టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్ చేసిన కామెంట్స్ డ్రంక్ అండ్ డ్రైవ్‌ను ప్రోత్సహిస్తున్నట్టు అర్థమవుతోంది. ఏలూరు జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎంపీ పుట్టా మహేశ్ మాట్లాడుతూ.. పల్లెల్లో ఎక్కడికక్కడ డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుకుంటున్నారు. జంగారెడ్డి గూడెంతోపాటు ఇతర చిన్న చిన్న పల్లెల్లో కానీ, పోలవరం ఏరియా పరిసర ప్రాంతాల వాళ్లకు ఈ డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు చేయడంతోపాటు విపరీతమైన చలాన్లు వేస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయి. పల్లెల్లో ఎవరో చిన్న వ్యక్తికి జరిమానా వేస్తున్నారు.. పొలిటికల్‌గా మాకు సమస్యలు వస్తున్నాయి. రూల్ ప్రకారమే ముందుకు వెళ్లండి..కానీ మాకు కూడా గవర్నమెంట్‌కు వ్యతిరేకంగా రాకుండా ఎట్లా బ్యాలెన్స్ చేయాలో చూడండి సార్ అంటూ ఎంపీ పుట్టా మహేశ్ పక్కనే ఉన్న ఎస్పీని రిక్వెస్ట్ చేయడం గమనార్హం. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల విషయంలో రోజుకు 30 ఫోన్లు వాటి గురించే వస్తున్నాయి. డ్రంక్ అండ్ డ్రైవ్ విషయంలో స్థానిక మండల పార్టీ అధ్యక్షులు అడిగితే కొంచెం చూసి వారికి సపోర్ట్ చేయండి. మండల పార్టీ అధ్యక్షుడు పొలిటికల్‌గా ఏమతుందంటే.. ఒక ఎస్‌హెచ్‌వోతో ఏదైనా పనిచేయించుకోవాలంటే అది కూడా చేయించుకోలేకపోతున్నారనే సమస్య కూడా ఉంది. ఎస్‌హెచ్‌వోలతో మా మండలం పార్టీ అధ్యక్షులకు, కార్యకర్తలకు మీరే మినహాయింపు ఇస్తే బాగుంటుందని కోరారు. అధికారిక సమావేశంలో మా పార్టీ వాళ్లు పనులు చేయించుకోవడానికి సహకరించండి..డ్రంక్ అండ్ డ్రైవ్‌లో వారికి మినహాయింపు ఇవ్వండి అంటూ చేసిన కామెంట్స్ చర్చనీయాంశంగా మారాయి.




# యువతకు సినీ, ఏఐ రంగాల్లో కొత్త అవకాశాలు

## మంత్రి కందుల దుర్గేష్ కీలక ప్రకటన


**అమరావతి, జూన్ 25:** నవ్యాంధ్రలో సరికొత్త 'క్రియేటివ్ ఎకానమీ విప్లవం'కు శ్రీకారం చుట్టనున్నట్లు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. ఈరోజు (గురువారం) రాష్ట్ర సచివాలయంలో మంత్రిని జాడెక్స్ ఇన్నోవిజన్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు కలిసి పలు అంశాలపై చర్చించారు. రాష్ట్రంలోని స్థానిక యువత ప్రతిభను ప్రోత్సాహించడంతో పాటు.. యువతకు ఆధునిక సినీ సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణను రూపొందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. జూలై నెలలో మెగా ఫిల్మ్ వర్క్‌షాప్ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని మంత్రి చెప్పారు. సినీ పరిశ్రమకు సంబంధించిన 24 క్రాఫ్ట్స్‌పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఏఐ ఆధారిత ఫిల్మ్ మేకింగ్ నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. 24 క్రాఫ్ట్స్ శిక్షణకు సంబంధించి జాడెక్స్ సంస్థ రూపొందించిన యాక్షన్ ప్లాన్‌పై సమావేశంలో సమగ్రంగా చర్చించినట్లు మంత్రి తెలిపారు. యువతకు ప్రపంచ స్థాయి ఫిల్మ్ మేకింగ్‌పై అవగాహన కల్పిస్తామన్నారు. సినీ, మీడియా రంగాల్లో కొత్త ఉపాధి అవకాశాలు సృష్టించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రంలో క్రియేటివ్ ఎకానమీ బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణను రూపొందించనున్నట్లు మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.



# ఉండవల్లి జోన్-11లో రూ.426 కోట్ల ట్రంక్

## ఇన్‌ఫ్రా పనులకు ప్రభుత్వం ఆమోదం

**అమరావతి, జూన్ 25:** ఏపీ రాజధాని అమరావతి అభివృద్ధి మరో కీలక అడుగు పడింది. ఉండవల్లి జోన్-11 పరిధిలో ట్రంక్ మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మొత్తం రూ.426 .46 కోట్ల వ్యయంతో భారీ మౌలిక సదుపాయాల పనులను చేపట్టనుంది. ఈ ప్రాజెక్టు కింద రోడ్డు, డ్రైన్లు, సరఫరా, సెవరేజ్ పనులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విద్యుత్ సరఫరా, ఐసీటీ యుటిలిటీ డక్టు, రీయూజ్ వాటర్ లైన్ నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఎస్‌టీపీ ఏర్పాటు, అవెన్యూ ప్లాంటేషన్ పనులు కూడా ఈ ప్యాకేజీలో భాగంగా అమలు చేయనున్నారు. అమరావతి ల్యాండ్ పూలింగ్ లేఅవుట్ల అభివృద్ధికి అవసరమైన ఈ పనులను ప్యాకేజీ-38 కింద చేపట్టనున్నారు. ఎల్-1 బిడ్డర్‌గా ఎంపికైన ఎన్‌సీసీ లిమిటెడ్‌కు పనులను కేటాయించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అంచనా వ్యయం రూ.409.78 కోట్లుగా ఉండగా, 4.07 శాతం అధిక బిడ్‌కు అనుమతి ఇచ్చింది. ఈ కాంట్రాక్ట్‌కు రెండేళ్ల డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్‌ను నిర్దేశించింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి జూన్ 19న జరిగిన ఏపీసీ ఆర్డీఏ అథారిటీ సమావేశంలో తీర్మానం నెం.669/ 2026 ఆమోదం పొందింది. అనంతరం ప్రభుత్వం జీఓ ఆర్టీ నెం.777ను జారీ చేస్తూ అధికారిక ఉత్తర్వులు విడుదల చేసింది. పనుల అవార్డు జారీ చేసేందుకు ఏడీసీఎల్ సీఎండీకి అధికారాలను అప్పగించింది ఉండవల్లి ప్రాంతంలో సమగ్ర మౌలిక సదుపాయాల అభివృద్ధి ద్వారా రాజధాని నిర్మాణానికి మరింత వేగం చేకూరనుంది. ఈ ప్రాజెక్టు అమలుకు అవసరమైన నిధులను ఏపీసీఆర్డీఏ సమకూర్చనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. రాజధాని అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.



# విజయవాడలో టీడీపీ జెండా దిమ్మె

## కూల్చివేత ఘటన వైసీపీ నేత అరెస్ట్

**విజయవాడ, జూన్ 25:** కానూరు గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. టీడీపీ జెండా దిమ్మెను వైసీపీ స్థానిక నాయకుడు దేవభక్తుని చక్రవర్తి, అతని అనుచరులు కూల్చేశారు. దీంతో టీడీపీ శ్రేణులు ఆందోళనకు దిగాయి. విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అక్కడకు చేరుకుని వైసీపీ నేతల చర్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే.. ధ్వంసం చేసిన టీడీపీ జెండాను వెంటనే నిర్మాణం చేశారు. గ్రామంలో ఘర్షణ వాతావరణం సృష్టించారంటూ దేవభక్తుని చక్రవర్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అరెస్టు చేసేందుకు వెళ్లిన పోలీసులను వైసీపీ కార్యకర్తలు అడ్డుకున్నారు. దేవభక్తుని చక్రవర్తి రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. జై జగన్ అంటూ నినాదాలతో పోలీసులపై వైసీపీ కార్యకర్తలు జులుం ప్రదర్శించారు. దీంతో అదనపు బలగాలను రంగంలోకి దించిన పోలీసులు.. నిరసనకు దిగిన కార్యకర్తలను పక్కకు లాగేశారు. దేవభక్తుని చక్రవర్తిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.




**టీడీపీ శ్రేణుల ఆగ్రహం..**

టీడీపీ జెండా దిమ్మెను కూల్చడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఆ పార్టీ శ్రేణులు.. స్థానిక వైసీపీ నేత దేవభక్తుని చక్రవర్తి నివాసం వైపుకు దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. వెంటనే పోలీసు అదనపు బలగాలు రంగంలోకి దిగి.. ఆ మార్గంలో ఎవరూ వెళ్లకుండా అడ్డు కున్నారు. సంయమనం పాటించాలని, చట్టపరంగా వారిపై చర్యలు తీసుకోకుంటే అప్పుడు చూద్దామంటూ ఎమ్మెల్యే బోడె ప్రసాద్.. టీడీపీ శ్రేణులకు సర్ది చెప్పి వారిని వెనక్కి తీసుకెళ్లారు.

# విశాఖలో నవ వధువు ఆత్మహత్య



**విశాఖపట్నం, జూన్ 25:** నగరంలో పీఎం పాలెం పోలీసుస్టేషన్ పరిధిలోని ఆర్ హెచ్ కాలనీలో విషాదం చోటు చేసుకుంది. నవ వధువు ఆత్మహత్య చేసుకుంది. వివాహం అయిన 40 రోజులకే యాండ్రాపు కృష్ణవేణి (25) ఆత్మహత్య చేసుకుంది. భర్త ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఏడాది మే 13వ తేదీన విజయనగరం జిల్లా మెంటాడకు చెందిన యాండ్రాపు మురళీతో కృష్ణవేణికి వివాహం అయింది. జూన్ మొదటి వారంలో పీఎం పాలెంలో వీరు ఇల్లు అద్దెకు తీసుకున్నారు. స్థానికంగా ఓ కంపెనీలో భర్త మురళీ.. గోపాల పట్నంలోని షాపులో కృష్ణవేణి పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఎప్పటిలాగే మురళీ బుధవారం ఉదయం డ్యూటీకి వెళ్లి రాత్రికి ఇంటికి తిరిగి వచ్చాడు. ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు కృష్ణవేణి ఉరి వేసుకుని.. విగత జీవిగా వేలాడుతూ కనిపించింది. దీంతో ఆమె కుటుంబ సభ్యులకు మురళీ సమాచారం అందించాడు. అలాగే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని.. పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటన స్థలాన్ని ఏసీపీ అప్పలరాజుతోపాటు సీఐ పరిశీలించారు. కృష్ణవేణి మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మురళీతో పాటు ఇరు కుటుంబాల వారిని పోలీసులు విచారిస్తున్నారు.

# గుంతకల్లు మీదుగా ప్రత్యేక రైలు




**గుంతకల్లు(అనంతపురం):** ప్రయాణికుల రద్దీని తగ్గించడానికి జల్నా-యల్హాంక-జల్నా మధ్య (వయా గుంతకల్లు) నెల రోజులపాటు వీక్లీ ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జల్నా-యల్హాంక ప్రత్యేక వీక్లీ రైలు (07601)ను ఈ నెల 28 నుంచి జూలై 26 వరకూ ఆదివారాలలో ఐదు ట్రిప్పులు నడపనున్నారు. ఈ రైలు జల్నాలో సాయంత్రం 7-20 గంటలకు బయలుదేరి మరుసటిరోజు రాత్రి తొమ్మిదిన్నరకు యల్హాంకకు చేరుకుంటుందన్నారు. ఈ రైలు హిందూపురం, ధర్మవరం, అనంతపురం, గుత్తి, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, యాదగిరి, తాండూరు, వికారాబాద్, లింగంపల్లి, బేగంపేట, సికింద్రాబాద్, బొల్లారం, మేడ్చల్, కామారెడ్డి, నిజామాబాద్, బాసర, ధర్మాబాద్, ముడ్‌ఖేడ్, నాందేడ్, పూర్ణా, పర్బని, సేలు, పర్తూర్ మీదుగా జల్నాకు చేరుకుంటుందన్నారు.

# వైసీపీ నేతలపై కేసులు మాజీ మంత్రి

## కాకాణి సహా పలువురిపై చర్యలు

**నెల్లూరు జిల్లా, జూన్ 25 :** నెల్లూరు జిల్లాలో వైసీపీ నేతలపై పోలీసులు కేసులు నమోదు చేశారు. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఆనం విజయకుమార్ రెడ్డి, మేకపాటి రాజగోపాల్ రెడ్డి సహా 17 మంది ఎమ్మెల్సీలు, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలపై కేసులు నమోదయ్యాయి. చిన్నబజారు పోలీసుస్టేషన్, బాలాజీనగర్ పోలీసుస్టేషన్ పరిధిలో ఈ కేసులు నమోదు చేశారు. భారతీయ న్యాయ సంహిత లోని సెక్షన్లు 189(2), 126(2), 285 తీ/షతో పాటు 190 యాక్ట్ కింద కేసులు బుక్ చేశారు. ఏపీలో పెద్ద సినిమాకు క్లాప్ కొట్టి 20 ఏళ్లు ఇటీవల జిల్లాలోని పలు విద్యా సంస్థలతో పాటు ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డికి చెందిన కృష్ణచైతన్య విద్యాసంస్థల్లో విద్యాశాఖ అధికారులు తని ఖీలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ తనిఖీలపై ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి స్పందించి.. మంత్రి నారాయణ రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ అంశంపై వైసీపీ నేతలు నిరసన కార్యక్రమాలు చేపట్టారు.



# మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**




**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో(విశాల జ్యోతి):** విద్యార్థులు మాదక ద్రవ్యాలు మత్తు పదారాలకు దూరంగా ఉండి తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం మాదకద్రవ్యాల నిర్మూలన అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కొత్తగూడెం పట్టణంలో భారీ ర్యాలీని నిర్వహించారు. డ్రగ్స్ వాడకం అనేది వ్యక్తిగత సమస్య కాదని ఇది సామాజిక రుగ్మత అని దీనిపై పోలీసులతో పాటు ప్రతి పౌరుడు యుద్ధం చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు స్నేహితుల ఎంపికలో జాగ్రత్తగా ఉండాలని సినిమాలలోని మంచిని గ్రహించి చెడుని వదిలేయాలని క్రీడలు కళలు సాంస్కృతిక కార్యక్రమాలు వంటి సానుకూల ప్రత్యామ్నాయాలను అలవాటు చేసుకుని డ్రగ్స్‌కు వ్యతిరేకంగా యువత సైనికులుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. జిల్లాను డ్రగ్స్ రహిత భద్రాద్రిగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారాన్ని ధైర్యంగా తమకు తెలియజేయాలని కోరారు. అనంతరం సైబర్ నేరాల గురించి మాట్లాడుతూ అత్యాశకు పోయి త్వరితగతిన డబ్బును సంపాదించాలనే ఆలోచనతో చాలామంది సైబర్ నేరాల బారిన పడి కష్టపడి సంపాదించిన నగదును కోల్పోతున్నారని చదువుకున్నవారే ఎక్కువమంది సైబర్ నేరాలు బారిన పడుతున్నారని తెలిపారు. ఓటీపి ట్రాప్, ఆన్లైన్ ట్రేడింగ్, సోషల్ మీడియాల ద్వారా ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాల గురించి వివరించారు. విద్యార్థినులకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కలిగి ఉండాలని సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారాన్ని గోప్యంగా ఉంచాలని మహిళల భద్రతపై పలు సూచనలు చేశారు. అనంతర రోడ్డు భద్రతా నియమాలను పాటించడంలో స్వీయ క్రమశిక్షణ కలిగి ఉంటే చాలావరకు రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని హెల్మెట్ వినియోగం సీటు బెల్ట్ ప్రాధాన్యత డిఫెన్సివ్ డ్రైవింగ్ నియమాల గురించి వివరించారు. సుమారు 1500మందికి పైగా విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా ప్రతిజ్ఞ చేశారు.

ఈ కార్యక్రమంలో కమాండెంట్ పి.సి.వి. రమణ, కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, ఏఆర్ డిఎస్పి సత్యనారాయణ,అసిస్టెంట్ కమాండెంట్ లు హెచ్.అబ్దుల్ రషీద్, బి.మరియధాసు, డిస్టిక్ వెల్ఫేర్ ఆఫీసర్ స్వర్ణలత లేనినా, పోలీస్ అధికారులు సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# సమగ్ర గ్రామాభివృద్ధికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలి

**జిల్లా కలెక్టర్ అంకిత్**




**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో(విశాల జ్యోతి):** గ్రామ స్థాయిలో ప్రజల అవసరాలు మౌలిక సదుపాయాలు స్థానిక సమస్యలను గుర్తించి నాణ్యమైన గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని గ్రామాల సమగ్రాభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. గురువారం ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విద్యచందన, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి నాగలక్ష్మి, డి ఆర్ ఓ పద్మావతి ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక(జీపీడీపీ)పై ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లకు ఒక రోజు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ గ్రామసాయిలో ప్రజా అవసరాలు ప్రజా సౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని అన్ని శాఖల సమన్వయంతో పనిచేస్తూ సమర్థవంతమైన అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. గ్రామసభల ద్వారా ప్రజల అవసరాలు సమస్యలను గుర్తించి వాటికి ప్రాధాన్యతనిస్తూ కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. గ్రామాల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని అన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం తాగునీటి సరఫరా మౌలిక సదుపాయాల కల్పన ప్రభుత్వ పథకాల సమర్థ అమలు పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. గ్రామ పంచాయతీలు ఉత్తమ పనితీరు కనబరిచి రాష్ట్ర జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా అధికారులు కృషి చేయాలని తెలిపారు. ఈ ఓరియంటేషన్ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి విద్యచందన, పంచాయతీ కార్యదర్శి ఎం. సాయి, ఎంపీడీఓ సంకీర్త్, ఎంపీఓ వీరారెడ్డి, ఎంపీఓ సంధ్య శిక్షకులుగా పాల్గొని వివిధ అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, కొత్తగూడెం, భద్రాచలం డివిజన్ల డీఎల్పీఓలు, అన్ని మండలాల ఎంపీడీఓలు, ఎంపీఓలు,పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు సిబ్బంది పాల్గొన్నారు.

# అయోధ్య నిధుల వివాదం 29వ తేదీన పిల్ లిస్టింగ్ సుప్రీంకోర్టు




**న్యూఢిల్లీ:** అయోధ్య రామాలయంలో నిధులను దుర్వినియోగం చేశారని, ఆ ఘటనలో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరుతూ సుప్రీంకోర్టును ఓ పిటీషనర్ ఇవాళ ఆశ్రయించాడు. అయితే జూన్ 29వ తేదీన సోమవారం కోర్టుకు వచ్చి పిల్‌ను దాఖలు చేసుకోవాలని ఆ పిటీషనర్‌కు సుప్రీంకోర్టు చెప్పింది. నిధుల దుర్వినియోగం అంశంపై దర్యాప్తునకు ఎఫ్ఐఆర్ రిజిస్టర్ చేయాలని, అలాగే నిర్దేశిత సమయంలోగా నిధులపై దర్యాప్తును పూర్తి చేయాలని ఆ పిటీషన్‌లో కోరారు. సీబీఐ నేతృత్వంలోని సిట్ ప్రస్తుతం అయోధ్య నిధులపై దర్యాప్తు చేపడుతున్న విషయం తెలిసిందే. అడ్వకేట్లు అజయ్ కుమార్ రాయ్, దినేశ్ కుమార్ యాదవ్.. కోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. కోట్లాది భక్తుల, దాతల విశ్వాసాన్ని దృష్టిలో పెట్టుకుని, ప్రజాప్రయోజనాల రక్షణ కోసం నిధుల నిర్వహణ అంశంలో ఓ రెగ్యులేటరీ వ్యవస్థను తయారు చేయాలని కోరుతూ కేంద్రం, యూపీ సర్కారు, రామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టుకు ఆదేశాలు ఇవ్వాలని ఆ పిటీషన్‌లో కోరారు. జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ తో కూడిన ధర్మాసనం ఈ కేసులో వాదనలు విన్నది. లిస్టింగ్ కోసం సోమవారం పిల్ దాఖలు చేయాలని కోర్టు సూచించింది.

## రాహుల్ గాంధీపై శివరాజ్‌సింగ్ తనయుడు పరువునష్టం

# దావా విచారం వ్యక్తం చేసిన రాహుల్



**మధ్యప్రదేశ్:** కాంగ్రెస్ సీనియర్ లీడర్, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ క్షమాపణలకు అంగీకరించారు. గతంలో మాజీ సీఎం, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ తనయుడు కార్తికేయ సింగ్‌పై తాను చేసిన వ్యాఖ్యలకు విచారం వ్యక్తం చేస్తున్నట్లు కోర్టుకు తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలివి. గతంలో పనామా పత్రాలకు సంబంధించి వివాదం చెలరేగిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై రాహుల్ గాంధీ అప్పట్లో మాట్లాడారు. 2018లో, మధ్యప్రదేశ్‌లో జరిగిన ఎన్నికల సందర్భంగా ఝబ్వాలో నిర్వహించిన ఒక ర్యాలీలో రాహుల్ గాంధీ మాటాడారు. పనామా పత్రాలకు, శివరాజ్ సింగ్ చౌహాన్ తనయుడు కార్తికేయ సింగ్‌కు సంబంధం ఉందని ప్రస్తావించారు. ఈ వ్యాఖ్యలపై రాహుల్ గాంధీపై కార్తికేయ సింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ చేసిన వ్యాఖ్యలతో తన పరువుకు నష్టం కలిగిందని, అనవసరంగా, ఆధారాలు లేకుండా తన పేరు ప్రస్తావించారని కార్తికేయ సింగ్ అన్నారు. దీంతో రాహుల్ క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీపై కార్తికేయ సింగ్.. మధ్యప్రదేశ్‌లోని భోపాల్ కోర్టులో పరువునష్టం దావా దాఖలు చేశారు. దీనిపై విచారించిన కోర్టు రాహుల్ వ్యాఖ్యల్ని తప్పుబట్టింది. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ మధ్యప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించారు. క్షమాపణలు చెప్పేందుకు అంగీకరించారు. తాను చేసిన వ్యాఖ్యలు కార్తికేయను ఉద్దేశించినవి కావన్నారు. తన వ్యాఖ్యలపై విచారం వ్యక్తం చేస్తున్నట్లు రాహుల్ తెలిపారు. ఈ కేసు తదుపరి విచారణ జస్టిస్ ప్రమోద్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం జరగనుంది. ఈ నేపథ్యంలో హైకోర్టులో సమర్పించిన వివరాల్ని భోపాల్ కోర్టుకు అందించనున్నారు. గతంలోనే ఈ కేసు విచారణ కోసం కోర్టు రాహుల్ గాంధీకి సమన్లు జారీ చేసింది. వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశించింది. ఆయన తరఫున న్యాయవాదులు కోర్టులో వాదనలు వినిపించారు.

## జమ్ముకశ్మీర్‌లోని పోలీస్‌స్టేషన్‌పై సైనికుల దాడి


# 40 మంది జవాన్‌లపై ఎఫ్ఐఆర్ నమోదు



**జమ్మూకశ్మీర్:** దేశాన్ని రక్షించే సైనికుల కు, స్థానిక లా అండ్ ఆర్డర్‌కాపాడే పోలీసులకు మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. జమ్మూకశ్మీర్‌లోని కిష్టవార్ జిల్లాలోగల అథోలి పోలీస్ స్టేషన్‌పై కర్రలు, రాడ్లతో ఆర్మీ సిబ్బంది దాడికి తెగబడ్డారనే ఆరోపణలపై ఒక కమాండింగ్ ఆఫీసర్, మేజర్ సహా ఏకంగా 40 మంది ఆర్మీ సిబ్బందిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడం నేషనల్ లెవెల్లో హాట్ టాపిక్‌గా మారింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. 17 రాష్ట్రీయ రైఫిల్స్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎన్ అరుణ్ గాంధీ, మేజర్ వికాశ్ శర్మ, నయిబ్ సుబేదార్ శంకర్ గుర్కే సహా 40 మంది ఆర్మీ జవాన్లపై పోలీసులు కేసు ఫైల్ చేశారు. ప్రభుత్వ అధికారులపై దాడి చేయడం, పోలీస్ స్టేషన్ లోపలికి చొరబడి విధుల్లో ఉన్న సిబ్బందిని విచక్షణారహితంగా కొట్టడం వంటి తీవ్ర ఆరోపణలతో వీరిపై హత్యాయత్నం, పబ్లిక్ ప్రాపర్టీ ధ్వంసం చట్టాల కింద కఠినమైన లీగల్ సెక్షన్లు నమోదు చేశారు. కిష్టవార్ అసిస్టెంట్ రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ ఒక ఆర్మీ వాహనాన్ని లీగల్ రూల్స్ ప్రకారం సీజ్ చేయడమే ఈ గొడవకు అసలు కారణం. దీనిపై లోకల్ పోలీసులకు, ఆర్మీ వారికి మధ్య వాగ్వాదం జరగ్గా ఆర్మీ సిబ్బంది ముందస్తు ప్లాన్‌తో లాఠీలు, ఐరన్ రాడ్లు, సార్టింగ్ సర్వీస్ వెపన్స్‌తో స్టేషన్‌కు వచ్చి దాడి చేశారని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ఈ అటాక్‌లో డీఎస్పీ విజయ్ కుమార్ భగత్, ఎస్‌హెచ్‌వో అమృత్ కాటోచ్ సహా పలువురు పోలీసులు తీవ్రంగా గాయపడ్డారు. మేజర్ వికాశ్ శర్మ అత్యంత దురుసుగా ప్రవర్తిస్తూ ఎస్‌డీపీఓపైనే భౌతిక దాడికి పాల్పడ్డారని డీఎస్పీ విజయ్ కుమార్ వెల్లడించారు. ఈ ఘటన జాతీయ స్థాయిలో చర్చనీయాంశం కావడంతో రక్షణ శాఖ అధికారికంగా ప్రకటన విడుదల చేసింది. ఈ ఘటనపై దర్యాప్తుకు ఆర్మీ పూరిస్థాయిలో సహకరిస్తుందని ప్రకటనలో రక్షణ శాఖ ప్రతినిధి స్పష్టంచేశారు. పోలీస్, మిలిటరీ సంయుక్త విచారణ అనంతరం తప్పు చేసిన వారిపై ఆర్మీ లీగల్ రూల్స్ ప్రకారం కఠినమైనచర్యలు ఉంటాయని ప్రకటించారు.

## భారత్-బంగ్లాదేశ్ మధ్య టూరిస్ట్ వీసా సేవలు

### ప్రారంభం రెండేళ్ల తర్వాత బంగ్లాదేశీయులకు అనుమతి



**బంగ్లాదేశ్:** ఇటీవలి కాలంలో భారత్, బంగ్లాదేశ్ మధ్య సంబంధాలు కాస్త బలపడుతున్నాయి. ఇరు దేశాల మధ్య ఇటీవలే దౌత్య సేవలు ప్రారంభమయ్యాయి. రాయబార కార్యాలయాలు రెండు దేశాల్లో పని చేస్తున్నాయి. ఈ అంశంలో తాజాగా మరో ముందడుగు పడింది. రెండు దేశాల మధ్య టూరిస్ట్ వీసా సేవలు ప్రారంభం కానున్నాయి. దాదాపు రెండేళ్ల తర్వాత ఈ సేవలు ప్రారంభమవుతుండటం విశేషం. ఈ విషయాన్ని బంగ్లాలో భారత రాయబారి దినేష్ త్రివేది వెల్లడించారు. బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలోని వీసా జారీ కేంద్రాన్ని సందర్శించిన ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ నెల 28 నుంచి టూరిస్ట్ వీసా సేవలు అందుబాటులోకి రానున్నాయి. దీని ద్వారా బంగ్లాదేశ్ నుంచి ఇండియా రావాలనుకునే వారికి భారత పర్యాటక వీసాలు జారీ అవుతాయి. అలాగే, అనారోగ్యంతో బాధపడుతున్న బంగ్లా పౌరులు ఇండియాలో వైద్యం చేయించుకోవాలి అనుకుంటే.. మానవతా కోణంలో స్పందించి ఇండియాకు మెడికల్ వీసాలు కూడా జారీ చేస్తామని దినేష్ త్రివేది తెలిపారు. వీసాల జారీకి బంగ్లాలో ఐదు కేంద్రాల్ని ఏర్పాటు చేశారు. అవి ఢాకా, రాజ్‌షాహి, ఛిట్టగాంగ్, సిల్హెట్, ఖుల్నా. కొంతకాలంగా ఇండియా, బంగ్లాదేశ్ మధ్య సంబంధాలు దెబ్బతిన్న సంగతి తెలిసిందే. 2024లో అక్కడి ఇందిరా గాంధీ కల్చరల్ సెంటర్‌ను ధ్వంసం చేయడం నుంచి, భారత వీసా జారీ కేంద్రాలపై దాడులు వంటి కారణాలతో 2024 నుంచి వీసాల జారీ నిలిచిపోయింది. అప్పటి బంగ్లా పాలకుడు యూనస్ అనుసరించిన వైఖరి కూడా ఇందుకు కారణం. ఇదే సమయంలో అక్కడ హిందువులపై దాడులు, బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనాకు ఆశ్రయమివ్వడం వంటివి రెండు దేశాల మధ్య దూరాన్ని మరింత పెంచాయి. అయితే, ఇటీవల బంగ్లాలో జరిగిన ఎన్నికల్లో విజయం అనంతరం గత ఫిబ్రవరిలో తారిఖ్ రెహమాన్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టాక ఇరు దేశాల మధ్య సంబంధాలు నెమ్మదిగా బలపడుతున్నాయి. దీనిలో భాగంగా రెండు దేశాల మధ్య వ్యాపార, వాణిజ్య సంబంధాలు మెరుగయ్యాయి. తాజాగా వీసా జారీని కూడా ఇండియా ప్రారంభించింది.

### పైథాన్ బ్రీడర్‌ను పట్టించిన కరెంటు బిల్లు

#### 300కు పైగా కొండచిలువలు స్వాధీనం



**బీజింగ్:** చైనాలో ఓ వ్యక్తి ఇంటి నుంచి సుమారు 300కుపైగా కొండచిలువలను స్వాధీనం చేసుకున్నారు. అతను పైథాన్ సర్పాలను బ్రీడింగ్ చేస్తున్నట్లు గుర్తించారు. ఆ ఘటనకు చెందిన వివరాలు ఇలా ఉన్నాయి. జీజియాంగ్ ప్రావిన్సులో ఉన్న తైజావూ లో పోలీసులు ఓ ఇంటిని రెయిడ్ చేశారు. ఆ ఇంట్లో వాళ్లకు 309 పైథాన్ సర్పాలు చిక్కాయి. ప్లాస్టిక్ బాటిళ్లలో వాటిని అన్ని రూముల్లో పెట్టాడతను. అయితే ఆ ఇంటికి సమీపంలో ఉన్న ఓ కొండల్లో తొలుత ఓ వ్యక్తి అరుదైన కొండచిలువ సర్పాన్ని గుర్తించాడు. దీంతో ఆ విషయాన్ని అతను స్థానిక అధికారులకు తెలియజేశాడు. అయితే అరుదైన ఆ జాతి సర్పాలను చైనా చట్టాల ప్రకారం నిషేధిస్తారు. కానీ ఆ పైథాన్ సర్పం కనబడడం వల్ల.. సరీసృపాల నిపుణులు దాని గురించి ఆరా తీశారు. ఎవరో ఒకరు ఆ ప్రాంతంలో వాటిని పెంచుతున్నట్లు అనుమానించారు. ఇక పైథాన్ నిపుణుల ప్రకారం ఆ వ్యక్తి కోసం వేట కొనసాగించారుకొండచిలువ సర్పాలను బ్రీడింగ్ చేయాలంటే కనీసం 20 నుంచి 30 డిగ్రీల ఉష్ణోగ్రత కావాల్సి ఉంటుంది. అయితే ఆ టిప్ సాయంతో ఆ సర్పాలను పెంచి పోషిస్తున్న వ్యక్తిని పట్టేశారు. ఆ ప్రాంతంలో విద్యుత్తు బిల్లు అధికంగా వస్తున్న వ్యక్తి ఇంటిపై నిఘా పెట్టి అతన్ని అదుపులోకి తీసుకున్నారు. అతని ఇంటికి వెళ్లిన అధికారులు షాక్ తిన్నారు. ఆ వ్యక్తి పేరు గువో. అతను అవివాహితుడు. ఒంటరిగా ఇంట్లో ఉంటున్న అతను.. సుమారు 309 పైథాన్ పాములను బ్రీడింగ్ చేశాడు. 2014లో నాలుగు పాములను తెచ్చిన అతను.. బ్రీడింగ్ చేస్తూ వాటిని ఆన్‌లైన్ ద్వారా అమ్ముతున్నాడు.

"VISHALA JYOOTHI" vide PRGI Registration No. "TGBIL/25/A0946" Printed by Published by DEVENDAR KUNTA on behalf of DEVENDAR KUNTA, printed atHAMARA WARANGAL PRINTERS AND GRAPHICS, H.NO: 25-8-182,BABUJI NAGAR, KAZIPET, WARANGAL, TELANGANA - 506003. and published at H.NO. 4-123/1,KUNTA WADA,RAIPARTHY, WARANGAL, TELANGANA - 506314. Editor DEVENDAR KUNTA, Cell : 9440711117.

PRGI No: TGBIL/25/A0946
సమగ్ర తెలుగు దినపత్రిక

# హమ్మయ్యా భారీగా కుప్పకూలుతున్న బంగారం వెండి ధరలు ఏకంగా 7 నెలల కనిష్ఠానికి పతనం




భారతదేశంలో బంగారానికి మంచి డిమాండ్ ఉంటుంది. బంగారాన్ని ఎక్కువగా వినియోగించే దేశాల్లో చైనాతో పాటు ముందు వరుసలో ఉంటుంది. అయితే దానికి తగ్గట్లుగా దేశీయంగా మన దగ్గర అంత బంగారం అందుబాటులో ఉండదు. అందుకే ఎక్కువగా దిగుమతులపైనే ఆధారపడుతుంది. ముఖ్య ంగా మహిళలు మన దగ్గర బంగారు ఆభ రణాల్ని కొనుగోలు చేసి ధరించాలని ఆసక్తి చూపిస్తుంటారు. అయితే ఇటీవల డిమాండ్ కాస్త తగ్గిందని చెప్పొచ్చు. గోల్డ్, సిల్వర్ రేట్లు రికార్డు స్థాయి గరిష్ఠాలకు చేరడం అందుకు కారణం. ముఖ్యంగా గత సంవత్సరంలో బంగారం ధర 70 శాతం, వెండి రేటు సుమారు 150 శాతం వరకు పెరిగాయి. ఈ క్రమంలోనే సామాన్యులకు అందని స్థాయికి పెరిగాయి.అయితే ఎట్టకేలకు గోల్డ్, సిల్వర్ రేట్లు భారీగా పడిపోతున్నాయి. ముఖ్యంగా పశ్చిమాసియాలో అమెరికా- ఇరాన్ ఉద్రిక్తతలు మొదలైనప్పటి నుంచి పడుతూనే ఉన్న పసిడి, వెండి ధరలు ఇప్పుడు యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను పెంచుతుందన్న అంచనాలతో మరింత పడుతోంది. తాజాగా దేశీయంగా, అంతర్జాతీయంగా బంగార, వెండి రేట్లు ఏకంగా 7 నెలల కనిష్ఠ స్థాయిలకు పడిపోవడం గమనార్హం.పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ద్రవ్యోల్బణం పెరగ్గా.. దానిని అదుపులోకి తెచ్చేందుకు యూఎస్ ఫెడ్ వడ్డీ రేట్లు పెంచాలని చూస్తోంది. ఈ సెప్టెంబరులో వడ్డీ రేట్లు పెంచే అవకాశాలు ఉన్నాయని సమాచారం. ఈ కారణంతోనే యూఎస్ డాల ర్ పుంజుకొని దాదాపు 13 నెలల గరిష్ఠాలకు చేరింది. దీనికి తగ్గట్టుగా గోల్డ్ రేట్లు పతనం అవుతున్నాయి.స్పాట్ గోల్డ్ రేటు ఇప్పుడు ఔన్సుకు 4 వేల డాలర్ల మార్కు దిగువకు చేరింది. ప్రస్తుతం జూన్ 25న వార్త రాసే ఉదయం 7 గంటల సమయంలో 3980 డాలర్ల వద్ద ఉంది. సిల్వర్ 57 డాలర్ల దిగువకు చేరింది. ఇక్కడ ఆల్ టైమ్ హై నుంచి చూస్తే భారీగా దిగొచ్చాయి.దేశీయంగా బంగాడి రేట్లు ఎలా ఉన్నాయో చూదాంలో ఇవ్వాళ రూ. 250 తగ్గగా 22 కారెట్ల గోల్డ్ రేటు 10 గ్రాములకు రూ. 1,32,300 వద్ద ఉంది. కిందటి రోజు ఏకంగా రూ. 3100 తగ్గింది. ఇక 24 క్యారెట్ల పుత్తడి ధర చూస్తే తులం రూ. 1,44,330 వద్ద ఉంది. ఇవి 2025 నవంబర్ నాటి కనిష్టాలకు చేరాయి. అంటే 7 నెలల దిగువకు ధర పడిపోయిందన్నమాట. మరోవైపు సిల్వర్ ధర ఒక్కరోజులో రూ. 10 వేలు తగ్గి కిలోకు రూ. 2.40 లక్షలకు పడిపోయింది.

# మార్కెట్లు దూసుకెళ్తున్నా 3 శాతం పడిపోయిన ఎల్ఐసీ షేరు- కారణం ఇదే ఒక్కో షేరుకు 10 రూపాయలొస్తాయ్




పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టాయి. హోర్ముజ్ జలసంధి ద్వారా చమురు రవాణా సాధారణ స్థితికి చేరుకుంది. ఈ క్రమంలోనే ఒకవైపు క్రూడాయిల్ ధరలు పతనం అవుతున్నాయి. ఇవి యుద్ధం ముం దటి స్థాయికి చేరుకోవడం విశేషం. ఈ క్రమంలోనే స్టాక్ మార్కెట్లలోనూ మంచి జోష్ కనిపిస్తోంది. గత వారం నుంచి భారత స్టాక్ మార్కెట్లలో కొనుగోళ్లు వెల్లువెత్తుతున్నాయి. వరుస సెషన్లలో సూచీలు పుంజుకుంటూ ఇన్వెస్టర్లకు లాభాల పంట పండిస్తున్నాయి. ఇవాళ కూడా అదే జోష్ కొనసాగిస్తున్నాయి. ప్రస్తుతం జూన్ 25న (గురువారం) వార్త రాసే సమయంలో బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజి సూచీ సెన్సెక్స్ 500 పాయింట్లకుపైగా లాభంతో 77,500 మార్కుపైన ట్రేడవుతోంది. ఇదే సమయంలో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజి సూచీ నిఫ్టీ చూస్తే 170 పాయింట్లు పుంజుకొని ప్రస్తుతం 24,190 వద్ద కొనసాగుతోంది. ఎస్బీఐ, రిలయన్స్, ఎం అండ్ ఎం, హిందుస్థాన్ యూనిలివర్, బీఎస్ఈ, ఏషియన్ పెయింట్స్, ఎల్ అండ్ టీ ఇలా పలు హెవీ వెయిట్ స్టాక్స్ అన్నీ దూసుకెళ్తున్నాయి. మంచి లాభాల్లో ఉన్నాయి. ఇదిలా ఉన్నప్పటికీ భారతదేశ అతిపెద్ద ప్రభుత్వ రంగ బీమా సంస్థ ఎల్ఐసీ షేరు భారీగా పతనం అవుతోంది. కిందటి సెషన్‌లో ఎల్ఐసీ షేరు రూ. 436.60 వద్ద ముగియగా ఇవాళ నేరుగా దాదాపు 3 శాతం పతనంతో రూ. 423 వద్ద ఓపెన్ అయింది. అక్కడితో ఆగకుండా ఇంట్రాడేలో మరింత తగ్గి రూ. 421.65 వద్ద కనిష్ఠ స్థాయిని తాకింది. ఇప్పుడు రాస్తే సమయంలో ఉదయం 11.45 గంటలకు చూస్తే 3 శాతం నష్టంతోనే రూ. 423 స్థాయిలో ట్రేడవుతోంది.ఒక్కో షేరుకు రూ. 10 డివిడెండ్ ఈ స్టాక్ ఇవాళ ఇంతలా పతనం అయ్యేందుకు ప్రధాన కారణం ఎక్స్ డివిడెండ్ అవడమే. ఇటీవల 2025-26 ఆర్థిక సంవత్సరానికిగానూ ఎల్ఐసీ ఒక్కో ఈక్విటీ షేరుకు రూ. 10 చొప్పున ఫైనల్ డివిడెండ్ చెల్లించనున్నట్లు ప్రకటించింది. 100 షేర్లు ఉన్న వారికి రూ. 1000 వస్తుంది. ఈ డబ్బులు నేరుగా అకౌంట్లలోనే జమవుతాయి. దీనికి రికార్డ్ తేదీ జూన్ 25గా నిర్ణయించింది. అంటే డివిడెండ్ ప్రయోజనం పొందాలంటే ఆలోపే షేర్లను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే ఎక్స్ డివిడెండ్ కాంణంగా షేర్ హోల్డర్లకు డివిడెండ్ చెల్లింపులు చేయాలి కాబట్టి దానికి అనుగుణంగా షేర్ ధర అడ్జస్ట్ అయింది.ఇక ఎల్ఐసీ మార్కెట్ విలువ చూస్తే ప్రస్తుతం రూ. 5.38 లక్షల కోట్లుగా ఉంది. స్టాక్ 52 వారాల గరిష్ఠ ధర రూ. 490 కాగా, కనిష్ఠ ధర రూ. 360.75 గా ఉంది. గత నెల వ్యవధిలో ఈ స్టాక్ ధర కేవలం 2 శాతం లోపే పెరిగింది. 10 శాతం తగ్గింది.

# రైల్వే సంస్థలో కేంద్రం వాటా విక్రయం తొలిరోజే ఎగబడ్డ ఇన్వెస్టర్లు అమ్మకానికి మరో 13 కోట్ల షేర్లు




ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కొంత కాలంగా నిర్వహిస్తున్న ఆఫర్ ఫర్ సేల్‌కుమంచి రెస్పాన్స్ లభిస్తున్న సంగతి తెలిసిందే. వరుస పెట్టి ప్రభుత్వ దిగ్గజ సంస్థలు, బ్యాంకుల్లో వాటా విక్రయిస్తుండగా ఇప్పుడు జూన్ 24న రైల్వే సంస్థ ఐఆర్ఎఫ్‌సీలోనూ ఓఎఫ్ఎస్ లాంచ్ చేసింది. ముందుగా నాన్ రిటైల్ ఇన్వెస్టర్లకు అందుబాటులోకి తీసుకురాగా వీరి నుంచి అదిరిపోయే రెస్పాన్స్ లభించింది. తక్కువ ధరకే షేర్లను కొనుగోలు చేసేందుకు ఎగబడ్డారని చెప్పొచ్చు. మొత్తం 2 శాతం వాటా విక్రయానికి అంగీకారం తెలపగా.. ముందుగా ఒక శాతం విక్రయించి, తర్వాత రెస్పాన్స్‌ను బట్టి మరో శాతం విక్రయిస్తామని ప్రకటించింది. దీనిని గ్రీన్ షూ లేదా ఓవర్ సబ్‌స్క్రిప్షన్ ఆప్షన్ కింద కేటాయించిందిఇందులో భాగంగా ఒక శాతానికి సమానమైన 13.06 కోట్ల షేర్లను తొలుత విక్రయించాలని ప్లాన్ చేసింది. ఇందులో నాన్ రిటైల్ ఇన్వెస్టర్లకు 11.76 కోట్ల షేర్లను అందుబాటులో ఉంచగా తొలి రోజే ఇక్కడ ఏకంగా 21.87 కోట్ల షేర్ల కోసం బిడ్స్ దాఖలు చేశారు. దీంతో 1.86 రెట్ల మేర సబ్‌స్క్రైబ్ అయింది. ముందటి క్లోజింగ్ ధర రూ. 98 తో పోలిస్తే దాదాపు 8 శాతం డిస్కౌంట్ ధరకే రూ. 91.07 వద్దే విక్రయం జరిగింది.ఇక ఇవ్వాళ జూన్ 25న రిటైల్ ఇన్వెస్టర్లు, ఉద్యోగుల కోసం అందుబాటులో ఉంటుందని ప్రకటించగా దీనికి కూడా మంచి రెస్పాన్స్ లభిస్తోంది. అయితే తొలి రోజు మంచి రెస్పాన్స్ లభించగా ప్రభుత్వం గ్రీన్ షూ ఆప్షన్ వినియోగిస్తోంది. అంటే ఇక్కడ గురువారం రోజు మరో 13.06 కోట్ల షేర్లు కూడా అందుబాటులో ఉంటాయి.
ఈ ఓఎఫ్ఎస్ ద్వారా మొత్తం 26.13 కోట్ల షేర్ల విక్రయంతో సుమారు రూ. 2300 కోట్ల వరకు నిధుల్ని సమీకరించాలని ప్లాన్ చేసింది. అయితే తొలిరోజే సంస్థాగత మదు పరుల నుంచి రూ. 1900 కోట్ల వరకు విలు వైన బిడ్స్ దాఖలయ్యాయి. అయితే ఓఎఫ్ఎస్ లాంఛ్ అవగా ఐఆర్ఎఫ్‌సీ షేర్లు బుధవారం సెషన్‌లో భారీగా పతనం అయ్యాయి. 5 శాతానికిపైగా పతనంతో రూ. 92.50 వద్ద స్థిరపడింది. గురువారం సెషన్‌లో కూడా షేరు స్వల్పంగా నష్టాల్లో ఉంది.

# తెలుగువారి కంపెనీల్లో దివీస్ టాప్




తెలుగువారి కంపెనీల్లో దివీస్ టాప్‌హైదరాబాద్ దేశంలోని అత్యంత విలువైన 500 ప్రైవేట్ కంపెనీల జాబితాలో తెలుగువారికి చెందిన 39 సంస్థలకు చోటు దక్కింది. హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఈ అన్ని సంస్థల్లో దివీస్ లేబొరేటరీస్ రూ. 1.7 లక్షల కోట్ల మార్కెట్ విలువతో అగ్రస్థానంలో నిలిచింది. డాక్టర్ రెడ్డీస్ (రూ.1.1 లక్షల కోట్లు), మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (రూ.83,800 కోట్లు) వరుసగా 2, 3 స్థానాల్లో ఉన్నాయి.2025 సంవత్సరానికిగాను యాక్సిస్ బ్యాంక్‌కు చెందిన బర్గండీ ప్రైవేట్, హురున్ ఇండియా సంయుక్తంగా విడుదల చేసిన ఈ రిపోర్టులోని మరిన్ని ముఖ్యాంశాలు..తెలుగువారి కంపెనీల మొత్తం విలువ రూ.12.1 లక్షల కోట్లకు పెరిగింది. 2021తో పోలిస్తే రూ.5.2 లక్షల కోట్లు (75 శాతం) పెరిగింది. ఐదేళ్లలో కంపెనీల సంఖ్య కూడా 30 నుంచి 39కి చేరింది. అందులో 16 హెల్త్‌కేర్ రంగానికి చెందినవే కావడం గమనార్హం. ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ రంగం నుంచి 5 కంపెనీలకు చోటు లభించగా.. ఇండస్ట్రియల్ ప్రొడక్ట్స్, ఆటోమొబైల్ అండ్ ఆటో కాంపోనెంట్స్ రంగాల నుంచి 3 చొప్పున సంస్థలున్నాయి.గత ఏడాదిలో మనోళ్ల కంపెనీల మొత్తం విక్రయాలు రూ.2.6 లక్షల కోట్లకు పెరిగాయి. ఐదేళ్లలో సేల్స్ రూ. 83,625 కోట్ల (47 శాతం) మేర వృద్ధి చెందాయి. వీటిల్లో మొత్తం 3.4 లక్షల మంది పనిచేస్తున్నారు. గత ఐదేళ్లలో వీరి సంఖ్య 70 శాతం పెరిగింది. తెలుగోళ్ల కంపెనీల సగటు వయసు 37 ఏళ్లుగా ఉంది.అత్యధిక మంది మహిళలు పనిచేస్తున్న తెలుగు కంపెనీల్లో డాక్టర్ రెడ్డీస్ (8,480 మంది) టాప్‌లో ఉంది. మెడ్‌ప్లస్ హెల్త్ సర్వీసెస్(8,143 మంది), రెయిన్‌బో చిల్డ్రన్స్ మెడికేర్ (3,427 మంది) ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి.ఐదో సారీ రిలయన్సే నం.1భారత్‌లోని టాప్ 500 ప్రైవేట్ (లిస్టెడ్, అన్‌లిస్టెడ్) కంపెనీల మొత్తం విలువ 3.4 లక్షల కోట్ల డాలర్లు (సుమారు రూ.320 లక్షల కోట్లు) దాటేసింది. అందులో రిలయన్స్ ఇండస్ట్రీస్ రూ.19.36 లక్షల కోట్లతో వరుసగా ఐదో ఏడాదీ దేశంలోని అత్యంత విలువైన కంపెనీగా నిలిచింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రూ.11.87 లక్షల కోట్లతో రెండో స్థానాన్ని దక్కించుకోగా.. భారతీ ఎయిర్‌టెల్ రూ.11.49 లక్షల కోట్లతో మూడో స్థానంలో ఉంది. కాగా, రూ.4.86 లక్షల కోట్లతో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ( ఎన్ఎస్ఈ) అత్యంత విలువైన అన్ లిస్టెడ్ కంపెనీగా నిలిచింది.8గత ఏడాదికి లిస్ట్‌లోని 40 శాతం (198) కంపెనీల విలువలో మాత్రమే వృద్ధి నమోదైంది. దేశంలోని టాప్ టెన్ కంపెనీల మొత్తం విలువ రూ.86 లక్షల కోట్లుగా నమోదైంది. ఇది భారత జీడీపీలో దాదాపు నాలుగో వంతు. కెనడా జీడీపీ కంటే అధికం. ఇండోనేషియా, స్పెయిన్‌ల మొత్తం జీడీపీ కంటే కూడా ఎక్కువ. అంతేకాదు, టాప్ 500 కంపెనీల మొత్తం విలువలో 27 శాతానికి సమానం. టాప్ టెన్ లిస్ట్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్ విలువ అత్యధికంగా రూ.1.8 లక్షల కోట్లు పెరగగా.. బజాజ్ ఫైనాన్స్ విలువలో అత్యధికంగా 37 శాతం వృద్ధి నమోదైంది.

# ప్రపంచ పరిశోధనల కేంద్రంగా భారత్



**న్యూఢిల్లీ:** ప్రపంచ పరిశోధనల కేంద్రం గా ఎదగాలన్న మన దేశ లక్ష్యం నెరవేరాలంటే ప్రస్తుత అంచెలంచెల పురోగతి విధానం ఏ మాత్రం పనికి రాదని డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ చైర్మన్ సతీశ్ రెడ్డి స్పష్టం చేశారు. భారీ నవకల్పనలు, ఆవిష్కరణలతోనే ఈ లక్ష్యం నెరవేరుతుందన్నారు. శాస్త్రీయ పరిశోధనా ఫలితాలు రోగులకు ఉపయోగపడాలంటే అవి ఆచరణీయంగా ఉండాలన్నారు. 'ఆచరణీయ పరిశోధనా వ్యవస్థ, భారత్ కోసం ప్రపంచం నేర్పుతున్న పాఠాలు' అనే పేరుతో కంపెనీ విడుదల చేసిన శ్వేత పత్రంలో సతీశ్ రెడ్డి ఈ అభిప్రాయాలు వ్యక్తం చేశారు.మనకు సత్తా ఉంది: ప్రపంచ వైద్య రంగ రూపురేఖలను మార్చే సత్తా మన దేశానికి ఉందని సతీష్ రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు. ఆధునిక బయోమెడికల్ ఆవిష్కరణల్లో ఆచరణాత్మక శాస్త్రీయ పరిశోధనలు కీలక పాత్ర పోషిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. దీని వల్ల శాస్త్రీయ ఆవిష్కరణలు-అమలు మధ్య వ్యత్యాసం కూడా తగ్గిపోతోందన్నారు.

# సెన్సెక్స్ 790 పాయింట్లు అప్





**ముంబై:** చమురు సెగ తగ్గడంతో దేశీయ స్టాక్ మార్కెట్ బుధవారం బాగా కోలుకుంది. సెన్సెక్స్ 790.54 పాయింట్ల లాభంతో 76,991.22 వద్ద, నిఫ్టీ 50 సూచీ 197.55 పాయింట్ల లాభంతో 24021.65 వద్ద ముగిశాయి. బ్యాంకింగ్, ఫైనాన్షియల్, ఐటీ రంగ షేర్లలో భారీ కొనుగోళ్లు ప్రామాణిక సూచీలను లాభాలవైపు నడిపించాయి.బ్రెంట్ రకం ముడి చమురు ధర 3.01 శాతం నష్టపోయి 74.76 డాలర్లకు చేరింది. అమెరికాలోని వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ రకంపీపా ముడి చమురు ధర కూడా 2.96 శాతం నష్టపోయి 71.04 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. గత నాలుగు నెలల్లో ముడి చమురు ధర ఇంత కనిష్ఠ స్థాయికి చేరడం ఇదే మొదటిసారి.

## 300 నగరాలకు అమెజాన్ నౌ విస్తరణ




**న్యూఢిల్లీ:** దేశంలో తన అల్ట్రా ఫాస్ట్ డెలివరీ సర్వీసు 'అమెజాన్ నౌ'ను అమెజాన్ మరింత విస్తరించనుంది. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా 300కు పైగా నగరాలకు విస్తరించాలనుకుంటున్నట్టు కంపెనీ పేర్కొంది. దీంతో దేశంలో అతిపెద్ద 'డెలివరీ ఇన్ మినిట్స్' నెట్‌వర్క్‌ను నిర్మించాలనుకుంటోంది. ఈ ప్రకటన భారత్‌పై పెరుగుతున్న అమెజాన్ ప్రాధాన్యాన్ని తెలియజేస్తోంది. ఈ కంపెనీ ఈకామర్స్, లాజిస్టిక్స్, క్లౌడ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధపై దూకుడుగా పెట్టుబడి పెడుతోంది. భారత్‌లో తమ కార్యకలాపాల్లో అమెజాన్ నౌ వేగంగా వృద్ధి చెందుతున్న వ్యాపారమని కంపెనీ పేర్కొంది. దీన్ని ప్రారం భించినప్పటి నుంచి ప్రతి త్రైమాసికంలో ఆర్డర్ల పరిమాణం రెండింతలు అవుతున్నట్టు తెలిపింది. కాగా అమెజాన్ సీఈవో ఆండీ జస్సీ భారత్ పర్యటనకు వచ్చారు. బుధవారం ముంబైలోని అమెజాన్ నౌ మైక్రో ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్‌ను సందర్శించారు. తర్వాత పలువురు వ్యాపారవేత్తలతో సమావేశమయ్యారు.ఫ్లిప్‌కార్ట్ క్విక్ కామర్స్ విభాగమైన ఫ్లిప్‌కార్ట్ మినిట్స్ మైక్రో ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్ల సంఖ్య దేశంలోని 130కి పైగా నగరాలు, 8వేలకు పైగా పిన్‌కోడ్స్ పరిధిలో వెయ్యిని దాటింది. 2024 ఆగస్టులో దీన్ని ప్రారంభించగా.. రెండేళ్లలోపే తాజా మైలురాయిని అధిగమించింది. గత ఏడాదితో పోల్చితే ప్లాట్‌ఫామ్‌పై ఆర్డర్లు 5 రెట్లకు పైగా పెరిగినట్టు కంపెనీ తెలిపింది.

# వైద్యులు, వైద్య విద్యార్థుల కోసం జెన్‌ఎండీ



**హైదరాబాద్ :** వైద్యులు, వైద్య విద్యార్థులకు కీలకమైన క్లినికల్ సమాచారాన్ని అందించేందుకు దోహదపడేక్లినికల్ కృత్రిమ మేధ (ఏఐ)ఆధారిత ప్లాట్‌ఫామ్ జెన్‌ఎండీని తెచ్చినట్టు ఆ సంస్థ వ్యవస్థాపక సీఈవో రితికా రెడ్డి తెలిపారు. రోజు వారీ వైద్య సందేహాలకు సమాధానాలు అందించడానికే కాకుండా నేర్చుకునేందుకు ఇది ఉపయోగపడుతుందని చెప్పారు. మందుల మోతాదులు, ఔషధ సమాచారం, చికిత్స ప్రణాళిక, ల్యాబ్ ఫలితాల విశ్లేషణ, ఓపీడీ డాక్యుమెంటేషన్, స్కాన్ల పరిశీలన, క్లినికల్ డాక్యుమెంటేషన్ తదితరాలకు సాధనాలను ఇది అందిస్తుందన్నారు.

# భీమ్ నుంచి మరిన్ని ఆర్థిక సేవలు

**హైదరాబాద్:**
డిజిటల్ పేమెంట్స్ యాప్ 'భీమ్' తన ఆర్థిక సేవలను మరింత విస్తృ తం చేస్తోంది. ఇందులో భాగంగా త్వరలో క్రెడిట్ కార్డులు, రుణాల పంపిణీతో పాటు ఇనట్వస్టమెంట్ సేవలు కూడా అందిస్తామని ఎన్‌పీ సీఐ భీమ్ సర్వీసెస్ లిమిటెడ్ (ఎన్‌బీఎసఎల్) ఎండీ, సీఈఓ లలి త నటరాజ్ తెలిపారు.

**లావాదేవీలు అదుర్స్ :**
గడిచిన ఏడాది కాలంలో భీమ్ యాప్ ద్వారా లావాదేవీల సంఖ్య మూడింతలు పెరిగి 24.4 కోట్లకు చేరాయి. తెలంగాణలోనూ ఇదే వృద్ధి కొనసాగినట్టు నటరాజ్ తెలిపారు. ఈ మే నెలలో దేశ వ్యాప్త లావాదేవీల విలువ రూ.26,952 కోట్లకు చేరుకుందన్నారు.




# ట్రూజన్ సోలార్‌లో

## చాముండేశ్వరనాథ్ పెట్టుబడులు




**హైదరాబాద్ :** సోలార్ రంగానికి చెందిన హైదరాబాద్ కంపెనీ ట్రూజన్ సోలార్‌లో బీసీ సీఐ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు, ఆంత్రప్రెన్యూర్ వీ చాముండేశ్వరనాథ్ రూ.2.25 కోట్ల పెట్టుబడులు పెట్టారు. ఈ కంపెనీలో క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌తోపాటు సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ కూడా పెట్టుబ డులు పెట్టారు.